మెదక్ | సంగారెడ్డి | సిద్దిపేట
వార్త

## ప్రభుత్వ భూమిని ఆక్రమిస్తే కఠిన చర్యలు తప్పవు

### -హుస్నాబాద్ తహసీల్దార్ రవిందర్‌రెడ్డి


ఆక్రమించిన భూమిని పరిశీలిస్తున్న తహశీల్ధార్

**హుస్నాబాద్, మార్చి20, ప్రభాతవార్త**

హుస్నాబాద్ మండలంలో ప్రభుత్వ భూమిని ఆక్రమించే వారు ఎంతటి వారైనా కఠిన చర్యలు తప్పవని తహశీల్ధార్ రవిందర్‌రెడ్డి హెచ్చరించారు. బుధవారం రోజున మండలంలోని పందిల్ల వాగులో పోలు కొమురయ్య అనే వ్యక్తి ప్రభుత్వ భూమిని ఆక్రమించుకుని వాగులో మట్టి పోసి చదును చేశాడని సమాచారం రావడంతో వాగును సందర్శించారు. ఈ సందర్భంగా అక్రమంగా కొమురయ్య భూమిని ఆక్రమించడంతో పాటు దానిని చదును చేసేందుకు పోసిన మట్టి, పైపులైన్లను జెసిబి సహాయం ద్వార తొలగించారు. అనంతరం మాట్లాడుతూ మండలంలో ఎవరైనా ప్రభుత్వ భూములు, చెరువులు, కాలువలు లాంటివి ఆక్రమిస్తే ఉపేక్షించేది లేదని, ఇలాంటి కార్యక్రమాలకు ఎవరు పాల్పడినా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ రాజయ్య, రికార్డ్ అసిస్టెంట్ కుమారస్వామితో పాటు తదితరులు ఉన్నారు.

## ఆర్‌డివో, తహశీల్ధార్‌లకు కృతజ్ఞతలు

### -సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు మల్లేష్....

హుస్నాబాద్ మండలం పందిల్ల గ్రామంలోని ఎల్లమ్మ చెరువు వాగులో అన్యాక్రాంతమౌతున్న ప్రభుత్వ భూమిని కాపాడాలని కోరుతూ గత కొద్ది రోజుల క్రితం సిపిఐ పార్టీ రాష్ట్ర సమితి సభ్యులు గడిపె మల్లేష్ ఫిర్యాదు చేయగా బుధవారం ఆర్డీవో, తహశీల్ధార్‌లు స్పందించి అన్యాక్రాంతమౌతున్న ప్రభుత్వ భూమిని కాపాడడం సంతోషంగా ఉందని గడిపె మల్లేష్ అన్నారు. ఈ విషయం పట్ల స్పందించిన వారికి మల్లేష్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

## గ్రీవెన్స్ కమిటీ ఏర్పాటు

**సంగారెడ్డి టౌన్, మార్చి 20, ప్రభాతవార్త:**

రానున్న పార్లమెంట్ ఎన్నికలను పురస్కరించుకుని ఎన్నికల నియమావళి అములులో భాగంగా గ్రీవెన్స్ కమిటిని ఏర్పాటు చేసినట్లు జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతి తెలిపారు. ఎన్నికలను పురస్కరించుకుని ఏర్పాటు చేసిన చెక్ పోస్టుల వద్ద, ఆయా ప్రాంతాల్లో నిర్వహించే తనిఖీలో 50వేల రూపాయలకు మించి తీసుకుపోతుంటే సంబంధిత ధృవపత్రాలు అందుబాటులో ఉంచుకోవాలన్నారు. తనిఖీలో 10 లక్షల రూపాయలకు పైగా పట్టుబడితే ఐటీ శాఖకు సమాచారం అందిస్తామన్నారు. గ్రీవెన్స్ కమిటి అధికారులుగా జిల్లా గ్రామీణాభివృద్ధి (డిఆర్‌డిఏ) జ్యోతి (9281487272), జిల్లా ముఖ్య ప్రణాళికాధికారి బాలశౌరి (6300614057), డివిజనల్ సబ్ ట్రెజరీ అధికారి వి నర్సింహాచారి (77799934149) విధులు నిర్వహిస్తారని, ఎవరికైనా ఏదైనా సమస్య వస్తే అధికారులను సంప్రదించాలని కలెక్టర్ సూచించారు.

# ప్రభుత్వ భూములు అన్యాక్రాంతం కాకుండా చూడాలి

### -ధరణి సమస్యలు వెంటనే పరిష్కరించాలి
### -అధికారులతో జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతి

**సంగారెడ్డి టౌన్, మార్చి 20, ప్రభాతవార్త:**

ఆయా శాఖల అధికారులు సమన్వయంతో పనులు చేస్తూ ప్రభుత్వ భూములు అన్యాక్రాంతం కాకుండా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతి అన్నారు. బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో రెవిన్యూ, నీటి పారుదల, ఇంజీరింగ్ అధికారులు, మున్సిపల్ అధికారులతో ప్రత్యేకంగా సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ వల్లూరు క్రాంతి మాట్లాడుతూ ప్రభుత్వ భూముల చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటు చేయాలన్నారు. ధరణి పెండింగ్ సమస్యలు వెంటనే పరిష్కారం అయ్యేలా చూడాలని సూచించరు. సంగారెడ్డి, పటాన్‌చెరు, జిన్నారం తదితర మండలాల్లో చెరువులు, కుంటలు, ప్రభుత్వ భూములు అన్యాక్రాంతం కాకుండా అధికారులు సమన్వయంతో పని చేస్తూ తగు చర్యలు తీసుకోవాలన్నారు. ఆయా మండాలాల్లో పెద్ద చెరువుల రికార్డులను వెంటనే సమర్పించాలని రెవిన్యూ, ఇరిగేషన్ అధికారలను ఆదేశించారు. అన్యాక్రాంతం అయిన ప్రభుత్వ భూముల పరిరక్షణకు అధికారులు పరిరక్షించాల్సిన అవసరం ఉందన్నారు. మైనింగ్ అనుమతులకు రెవిన్యూ అధికారులు ఎన్వోసి తప్పనిసరి అన్నారు. అనుమతి పొందిన మేరకే మైనింగ్ జరిగేలా అధికారులు పటిష్ట నిఘా ఏర్పాటు చేయాలన్నారు. బొల్లారం ఎర్రగుంట చెరువులో ఏర్పాటు చేసిన వెంచర్ వివరాలు వెంటనే అందచేయాలన్నారు. ధరణి పెండింగ్ సమస్యలను రెవిన్యూ అధికారులు వెంటనే పరిష్కరించాలన్నారు. గ్రామ స్థాయిలో ప్రభుత్వ భూములు ఆక్రమణకు గురికాకుండా పంచాయితీ కార్యదర్శులు చర్యలు తీసుకోవాలన్నారు. ప్రభుత్వ భూములు ఆక్రమణకు గురైతే పంచాయితీ కార్యదర్శులు రెవిన్యూ అధికారుల సహాయంతో నోటీసులు జారీ చేసి ఆక్రమణలు తొలగించేలా చర్యలు తీసుకోవాలన్నారు. మున్సిపల్ అధికారులు నోటీసులు ఇచ్చి గమ్మున కూర్చుంటున్నారని, చర్యలు చేపట్టాలని ఆదేశించారు.

కార్యక్రమంలో అదనపు కలెక్టర్ చంద్రశేఖర్, మాధురి, డిఎస్ఈ మురళీధర్, ఆర్‌డిఓ వసంత కుమారి, ఆయా మండలాల తహసీల్దార్‌లు తదితరులు పాల్గొన్నారు.



అధికారులకు సూచనలు చేస్తున్న జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతి

# జిల్లాలో అపార నష్టం మిగిల్చిన వడగళ్ల వాన

-చేతికి అందుతున్న పంట కళ్ల ముందే
-నెలకొరగడంతో నెత్తినోరు కొట్టుకుంటున్న రైతులు
-2800 ఎకరాలలో 1794 మంది రైతులకు నష్టం
-మొక్కజొన్న 1405, వరి 600 ఎకరాలలో నష్టం
-అత్యధికంగా చిన్నకోడూరు, బెజ్జంకి మండలాలలో నష్టపోయిన పంటలు

**సిద్దిపేట, ప్రభాతవార్త ప్రతినిధి :**

జిల్లాలో మంగళవారం సాయంత్రం ఈదురు గాలులు, ఉరుములు, మెరుపులతో అకస్మాత్తుగా రాళ్లతో కూడిన వడగళ్ల వర్షం కురువడంతో పంటలకు తీరని నష్టం వాటిల్లింది. వడగళ్ల వర్షంతో మొక్కజొన్న, వరి, పొద్దుతిరుగుడు పంటలతో పాటు మామిడి, కూరగాయల తోటలకు అపార నష్టం జరిగింది. వడగళ్ల వానతో చేతికి వస్తున్న పంటలు కళ్లముందే నెలకొరగడంతో రైతులు నెత్తినోరు కొట్టుకుంటున్నారు. చేతికి అందుతున్న పంటలతో చేసిన అప్పులు తీర్చుకుందామని రైతులు కన్న కలలను వడగళ్ల వాన పగటి కలలుగానే మిగిల్చింది. వడగళ్ల వానతో పంటలకు పెంకుటిండ్లకు సైతం నష్టం వాటిల్లింది. ఈదురు గాలులు వీయడంతో పెద్ద పెద్ద చెట్లు, విద్యుత్ స్తంభాలు నెలకొరిగాయి. విద్యుత్ స్తంభాలు నెలకొరగడంతో గ్రామాల్లో, పట్టణాలల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. జిల్లాలో అత్యధికంగా చిన్నకోడూరు మండల పరిధిలోని 15 గ్రామాల్లో బెజ్జంకి మండలాలలోని 9 గ్రామాల్లో దుబ్బాక మండల పరిధిలోని 6 గ్రామాల్లో, గజ్వేల్ మండలం 5 గ్రామాల్లో, తొగుట మండల పరిధిలోని మూడు గ్రామాల్లో పంటలకు, మామిడి, కూరగాయల తోటలకు నష్టం జరిగింది. అత్యల్పంగా నంగునూర్ మండలం దర్గాపల్లి, పాలమాకుల, సిద్దిపేట రూరల్ మండలం ఇరుకోడు, మిరుదొడ్డి మండలం భూంపల్లిలో, రాయపోల్ మండలం అనాజీపూర్, మంతూరు, కోహెడ మండల పరిధిలోని గుండారెడ్డిపల్లి, బస్వాపూర్, సిద్దిపేట అర్బన్ ఇమాంబాద్ గ్రామాల్లో పంటలకు నష్టం వాటిల్లింది. జిల్లాలో 2800 ఎకరాలలో 1794 మంది రైతులకు చెందిన పంటలకు, కూరగాయల తోటలకు అపార నష్టం వాటిల్లింది. వరి 600 ఎకరాలలో, మొక్కజొన్న 1405.5 ఎకరాలలో, పొద్దుతిరుగుడు 98 ఎకరాలు, మామిడి 414, కూరగాయాల తోటలకు 289 ఎకరాల నష్టం వాటిల్లినట్లు వ్యవసాయ, ఉద్యానవనశాఖ అధికారులు అంచనాలు వేశారు. జిల్లాలో వడగళ్ల వానతో పంటలు, కూరగాయల తోటలు నష్టపోయిన గ్రామాలను వ్యవసాయ అధికారి శివప్రసాద్, ఉద్యానవనశాఖ అధికారులు సందర్శించి రైతుల నుంచి పంట నష్ట వివరాలను సేకరించారు. మొత్తం మీద జిల్లాలో వడగళ్ల వానతో పంటలకు, కూరగాయ తోటలకు కోట్లాది రూపాయాల నష్టం వాటిల్లినట్లు తెలుస్తుంది.


నష్టపోయిన పంటలను పరిశీలిస్తున్న వ్యవసాయ అధికారులు


నెల రాలిన మామిడి కాయలు

## జిల్లా అధికారుల క్రియేషన్ క్లబ్ నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలి

### -జిల్లా కలెక్టర్ ఎం.మను చౌదరి


స్థలాన్ని పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్ మను చౌదరి

**సిద్దిపేట, ప్రభాతవార్త ప్రతినిధి :**

జిల్లా అధికారుల క్రియేషన్ క్లబ్ నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని జిల్లా కలెక్టర్ మిక్కిలినేని మను చౌదరి అర్‌అండ్‌బి అధికారులను అదేశించారు. బుధవారం అయన జిల్లా అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డితో కలిసి కలెక్టరేట్, పోలీసు కమిషనరేట్ మధ్యలో ఉన్న స్థలాన్ని పరిశీలించారు. ఒక ఎకరం స్థలంలో జిల్లా అధికారుల రిక్రియేషన్ క్లబ్ నిర్మాణానికి అలాగే చుట్టు ప్రహరీ గోడ నిర్మాణానికి ప్రతిపాదన సిద్దం చేయాలని అర్‌అండ్‌బి డిఈ వెంకటేష్‌ను అదేశించారు. కలెక్టర్ వెంట ఏవో రెహమాన్ ఉన్నారు.

## కడవేర్గు గ్రామ ప్రధాన రహదారి పక్కన చెత్త తొలగింపు

### (వార్త కథనానికి స్పందన)


వార్త కథనానికి స్పందించి రోడ్డు పక్కన చెత్తను తొలగించిన దృశ్యం

**చేర్యాల, మార్చి 20, ప్రభాతవార్త**

చేర్యాల మండలం కడవేర్గు గ్రామంలోని ప్రధాన రహదారి పక్కన (రోడ్డు పక్కనే చెత్తా...పట్టించుకోని అధికారులు) అనే శీర్షికన వార్త దినపత్రిలో బుధవారం వెలువడిన కథనానికి ఇంచార్జ్ ఎంపిడీవో మహబూబ్ అలీ స్పందించారు. బుధవారం ప్రభాతవార్తతో ఆయన మాట్లాడుతూ వార్తలో వచ్చిన కథనానికి స్పందించి గ్రామ పంచాయతి అధికారుల, సిబ్బందితో మాట్లాడి వెంటనే చెత్తను తొలగింపచేసినట్లు ఆయన తెలిపారు. మండలంలో ఎక్కడకూడా సమస్యలు తలెత్తకుండా చూస్తున్నామని ఎప్పటికప్పుడు ఆయా గ్రామాల అధికారులతో మాట్లాడి వివరాలు తెలుసుకుంటున్నామని తెలిపారు. ఎక్కడైన సమస్యలు ఉంటే ప్రజలు తమ దృష్టికి తీసుకువస్తే వెంటనే పరిష్కరిస్తామన్నారు.

## సిఎం రేవంత్‌రెడ్డి పార్టీ ఫిరాయింపులపై దృష్టిసారించడం మానుకోవాలి

### -ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలి

**సిద్దిపేట, ప్రభాతవార్త ప్రతినిధి :**

సిఎం రేవంత్‌రెడ్డి పార్టీ ఫిరాయింపులపై దృష్టిసారించడం మానుకోని..ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని బిజెపి నాయకులు, మెదక్ పార్లమెంటు అభ్యర్థి రఘునందన్‌రావు డిమాండ్ చేశారు. సిద్దిపేట జిల్లా కేంద్రంలోని కొండాభూదేవి ఫంక్షన్ హాల్‌లో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో అయన మాట్లాడారు. బిఆర్ఎస్ పార్టీ అధికారంలో ఉన్న సమయంలో మాజీ సిఎం కెసిఆర్ అవలంభించిన అప్రజాస్వామిక విధానాలను నేడు కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తరావ్వత సిఎం రేవంత్‌రెడ్డి అవలంభిస్తున్నారని మండిపడ్డారు. ఎన్నికలో పోటీ చేసి ఓటిమి చెందిన నాయకులతో అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేసే విధంగా జీవోలు జారీ చేయడం సరికాదన్నారు. అప్రజాస్వామిక విధానాలను తెలంగాణ ప్రజలు సహించరని హెచ్చరించారు. ప్రధాన మంత్రి నరేంద్రమోడీ దేశాభివృద్ధియే లక్ష్యంగా ముందుకు సాగుతు వచ్చారని తెలిపారు. దేశంలో బిజెపి 400లకు పైగా ఎంపి స్థానాలను గెలుచుకొని నరేంద్రమోడీ మూడో సారి ప్రధాని కావడం ఖాయమన్నారు. మెదక్ పార్లమెంటు స్థానంలో సైతం బిజెపి గెలిచితీరుతుందన్నారు. సమావేశంలో పార్టీ జిల్లా అధ్యక్షులు, నాయకులు గంగాడి మోహన్‌రెడ్డి, దూది శ్రీకాంత్‌రెడ్డి, వంగ రామచంద్రారెడ్డి, బైరి శంకర్ ముదిరాజ్, గోనె మార్కండేయులు తదితరులు పాల్గొన్నారు.


విలేకరులతో మాట్లాడుతున్న బిజెపి నాయకులు రఘునందన్‌రావు

## అంగరంగ వైభవంగా స్వామి వారి కళ్యాణోత్సవం

### -తరలివచ్చిన భక్త జనం


స్వామి వారి ఎదుర్కొలు నిర్వహిస్తున్న దృశ్యం

**సిద్దిపేట రూరల్, మార్చి 20, ప్రభాతవార్త:**

సిద్దిపేట జిల్లా కేంద్రంలోని పారుపల్లి వీధిలోని శ్రీ పాత వేంకటేశ్వర స్వామి దేవాలయంలో 54వ వార్షిక బ్రహ్మోత్సవాలలో భాగంగా బుధవారం లక్ష్మీ హవనం నిర్వహించారు. అనంతరం ఎదుర్కొల్లు నిర్వహించి శ్రీ భూ నీలా సమేత లక్ష్మీ వేంకటేశ్వర స్వామి కళ్యాణం శ్రీ వేంకటేశ్వర స్వామి సేవా సమితి అధ్వర్యంలో అంగరంగవైభవంగా నిర్వహించారు. కళ్యాణంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామి వారి కళ్యాణాన్ని వీక్షించారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో అలయ గౌరవాధ్యక్షులు గంప శ్రీనివాస్, అధ్యక్షులు నవీన్, కార్యకలాపాల అధ్యక్షులు పుల్లూరు శివకుమార్, యాద శ్రీనివాస్, కొర్తివాడ శ్రీనివాస్, గౌరీశంకర్, వీరేశం, బిక్షపతి, రత్నాకర్, దుర్గయ్య, ప్రవీణ్, మహేష్, శశాంక్, దామోదర్, సేవా సమితి సభ్యులు, మహిళ భజన, మహిళా గోష్టి సభ్యులు పాల్గొన్నారు.

## నేడు విద్యుత్ అంతరాయం

**పటాన్‌చెరు, మార్చి 20, ప్రభాతవార్త:**

గుమ్మడిదల మండలంలోని 132 33 కేవి సబ్‌స్టేషన్‌లో మరమ్మత్తుల కారణంగా నేడు మధ్యాహ్నం 01:00 గంటల నుండి సాయంత్రం 05:00 గంటల వరకు విద్యుత్ అంతరాయం ఉంటుందని పటాన్‌చెరు డీఈ రమేష్ గుమ్మడిదల విద్యుత్ కార్యాలయంలో విలేఖరుల సమావేశంలో ఆయన తెలిపారు. వినియోగ దారులు, పారిశ్రామిక వేత్తలు అంతరాయానికి సహకరించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో గుమ్మడిదల, ఏడి శ్రీకాంత్, బొంతపల్లి ఏఈ రవిందర్, జిన్నారం ఏఈ రాజు, విద్యుత్ సిబ్బంది పాల్గొన్నారు.

## తనిఖీలు పకడ్బందీగా చేపట్టాలి : జిల్లా పాలనాధికారి రాహుల్ రాజ్

**చిన్నశంకరంపేట, మార్చి 20, ప్రభాతవార్త:**

చెక్ పోస్టుల వద్ద ప్రతి వాహనాన్ని తప్పనిసరిగా తనిఖీ చేయాలని జిల్లా పాలనాధికారి రాహుల్ రాజ్ తెలిపారు. బుధవారం నాడు చిన్నశంకరంపేటలో మెదక్-చేగుంట ప్రధాన రహదారిపై ఏర్పాటు చేసిన చెక్‌పోస్టును పరిశీలించి పోలిసులకు, సిబ్బందికి పలు సూచనలు చేశారు. చెక్ పోస్టు వద్ద సిబ్బంది అప్రమత్తంగా ఉంటూ ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేయాలన్నారు. ప్రత్యేక నిఘా కోసం ఏర్పాటు చేసిన సిబ్బంది 24 గంటలు సీసీ కెమెరాలను పరిశీలించాలని, 1950 టోల్ ఫ్రీ నెంబర్ యొక్క ప్రాముఖ్యతను ప్రతి ఒక్కరికి తెలియచేయాలన్నారు. సార్వత్రిక ఎన్నికల నేపధ్యంలో రూ.50వేలకు మించి డబ్బులను తిసుకేళ్లే వారు తప్పనిసరిగా పత్రాలను వెంట తిసుకెళ్లాలన్నారు. వాహనాదారులు సహకరించాలని కోరారు. ఆయన వెంట ఆర్డీవో రమాదేవి, తహసీల్ధార్ మన్ననలు ఉన్నారు.


చిన్నశంకరంపేటలో ఏర్పాటు చేసిన చెక్‌పోస్టు వద్ద వాహనాలను తనిఖీ చేస్తున్న కలెక్టర్ రాహుల్‌రాజ్

## భూములు కోల్పోతున్న తమకు న్యాయం చేయాలి

### -ఐఓసి కార్యాలయం ముందు రైతుల ధర్నా


గజ్వేల్ ఐఓసి ముందు ధర్నా చేస్తున్న రైతులు

**గజ్వేల్, మార్చి 20 (ప్రభాతవార్త):**

ట్రిపుల్ ఆర్ రింగ్ రోడ్డులో భూములు కోల్పోతున్న రైతులు తమకు న్యాయం చేయాలని మర్కుక్ మండల పరిధిలోని పలు గ్రామాల రైతులు గజ్వేల్ పట్టణంలోని ఐఓసి కార్యాలయం గేట్ ముందు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ట్రిపుల్ ఆర్ రింగ్ రోడ్డు నిర్మాణం కొరకు భూములు సేకరిస్తున్నారని, భూములు కోల్పోయిన వారికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. గత ప్రభుత్వంలో భూసేకరణ చేశారని, కాంగ్రెస్ ప్రభుత్వంలో ట్రిపుల్ ఆర్ రింగ్ రోడ్డు నిర్మాణం వేగవంతం చేయాలని అనడంతో రైతులు ఆందోళన చెంది ఐఓసి కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. ఇప్పటికైనా కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మర్కుక్ మండలానికి చెందిన రైతులు పాల్గొన్నారు.

# రహదారిపై తెలుపు రంగు మార్కింగ్

**చిన్నశంకరంపేట, మార్చి 20, ప్రభాతవార్త:**

వాహన చోదకులు మరియు పాదచారులకు మార్గదర్శకత్వం కోసం రహదారిపై ఉపరితల గుర్తులను వేయిస్తారు రోడ్డు భవనాల శాఖ అధికారులు. మండలంలోని అక్కన పేట-మదూర్ ప్రధాన రహదారిపై బుధవారం నాడు సిబ్బందితో తెలుపురంగు మార్కింగ్‌ను అధికారులు వేయించారు. రోడ్లపై వెళ్లేటప్పుడు రోడ్డు నియమాలను పాటించడం తప్పనిసరి. రొడ్డుపై ఉండే గుర్తులపై ప్రతి ఒక్కరికి అవగాహన అత్యవసరం. రొడ్డుపై తెలుపురంగు కంటిన్యూగా ఒకటే ఉంటే వాహనదారులు తమకు కేటాయించిన లైన్‌లోనే వెళ్లాలని అర్థం. ఇతర లైన్‌లోకి వెళ్లరాదు. వాహనదారులు లైన్ ఛేంజ్ కావచ్చని అర్థం. అలా లైన్‌ను మార్చేటప్పుడు దిక్కులను చూస్తూ, జాగ్రత్తగా వెళ్లాలని అర్థం. ఎందుకంటే రోడ్డు ప్రమాదాలు జరిగే అవకాశం ఉంటుంది.

అక్కడక్కడ మధ్యలో బ్రేకులతో కూడిన తెలుపు రంగు గీత ఉంటే వాహనదారులు లైన్ ఛేంజ్ కావచ్చని, అలా లైన్‌ను మార్చేటప్పుడు దిక్కులను చూస్తూ జాగ్రత్తగా వెళ్లాలి.


అక్కన పేట-మదూర్ రహదారిపై తెలుపు రంగు మార్కింగ్ వేస్తున్న దృశ్యం

## కంటోన్మెంట్‌లో బిజెపిని గెలిపించేందుకు
# కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలి: ఈటెల రాజేందర్


ఈటెల రాజేందర్‌కు అభినందనలు తెలుపుతున్న కంటోన్మెంట్ బిజెపి నేతలు రామక్రిష్ణ, బి.ఎన్.శ్రీనివాస్,పరశరామ్ తదితరులు

కంటోన్మెంట్,మార్చి 20 ప్రభాత వార్త: పార్లమెంట్ ఎన్నికలతో పాటు కంటోన్మెంట్ అసెంబ్లీ ఉప ఎన్నికల్లో బిజెపి అభ్యర్థులను బారీ మెజార్టీతో గెలిపించేందుకు బిజెపి కార్యకర్తలు, నాయకులు సైనికుల్లా పనిచేయాలని మాజీ మంత్రి,మలా ్కజిగిరి పార్లమెంట్ బిజెపి అభ్యర్థి ఈటెల రాజేందర్ తెలిపారు. బుధవారం కంటోన్మెంట్ నియోజకవర్గానికి చెందిన బోర్డు నామినేటెడ్ సభ్యుడు జె.రామక్రిష్ణ, బిజెపి సీనియర్ నాయకులు బి.ఎన్.శ్రీనివాస్, పరశరామ్, ఆయా వార్డు అధ్యక్షులు శంకర్,వీరవర్ధన్ గౌడ్, రాజ్ మల్లేశ్, కనకరాజు, అరుణ్,అజయ్ యాదవ్, అశోక్, ప్రశాంత్, కిరణ్, అజయ్ కుమార్‌లతో పాటు వందలాది మంది బిజెపి కార్యకర్తలు ఈటెల రాజేందర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు.

**ఈటెలకు అభినందనలు తెలిపిన జెట్టీ ఉమేశ్..** కంటోన్మెంట్ 4వ వార్డు పికెట్‌లోని శ్రీ భూలక్ష్మి దేవాలయం అభివృద్ధి కమిటీ చైర్మన్,సామాజిక కార్యకర్త జెట్టీ ఉమా మహేశ్వర్ రావ్ బుధవారం మల్కాజిగిరి పార్లమెంట్ బిజెపి అభ్యర్థి ఈటెల రాజేందర్‌కు అభినందనలు తెలియజేశారు.

# సిఎం రేవంత్ రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరిక


ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి అభినందనలు తెలుపుతున్న కంటోన్మెంట్ నేత శ్రీగణేష్ తదితరులు

కంటోన్మెంట్, మార్చి 20 ప్రభాతవార్త: కంటోన్మెంట్ నియోజకవర్గానికి చెందిన ఎన్.శ్రీగణేష్ బుధవారం తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలియజేశారు. 2018,2023లలో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో కంటోన్మెంట్ నియోజకవర్గం బిజెపి అభ్యర్థిగా పోటీ చేసి ఓటమి పాలైయా ్యడు. అయితే కంటోన్మెంట్ ఎమ్మెల్యేగా విజయం సాధించిన లాస్య నందిత 3 నెలలలోపే మృతి చెందడం వల్ల ఆ సీట్ ఖాళీ ఏర్పడడంతో పార్లమెంట్ ఎన్నికలతో పాటు కంటోన్మెంట్ అసెంబ్లీ ఉప ఎన్నికలు నిర్వహించేందుకు ఎన్నికల సంఘం నిర్ణయించింది. మంగళవారం వరకు బిజెపి పార్టీ కార్యకలాపాల్లో చురుకుగా పనిచేసిన శ్రీగణేష్ అకస్మాత్తుగా నిర్ణయం తీసుకొని మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావ్,మాజీ మంత్రి పట్నం మహేందర్ రెడ్డిల చొరవతో ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా కంటోన్మెంట్ కాంగ్రెస్ టికెట్ తనకే కెటాయిస్తున్నట్లు ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి హామీ ఇచ్చినట్లు శ్రీగణేష్ తెలిపారు.

# పద్మశాలీలకు ఫైనాన్స్ కార్పోరేషన్ ఏర్పాటు చేయాలి


సమావేశంలో మాట్లాడుతున్న రవికుమార్

సైఫాబాద్, మార్చి 20 ప్రభాత వార్త: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చేనేత కార్మికుల సంక్షేమం, అభివృద్ధి కోసం 'పద్మశాలి ఫైనాన్స్ కార్పోరేషన్' ఏర్పాటు చేసినందుకు అఖిల భారత పద్మ శాలి సంక్షేమ సంఘం ధన్యవాదాలు తెలిపింది. ఈ మేరకు రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి, రాష్ట్ర మ ంత్రి పొన్నం ప్రభాకర్‌కు సంఘం అధ్యక్షుడు తుమ్మ సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శి సురపల్లి రవికు మార్, నాయకులు కొండా సహదేవ్, సి.నవీన్ తదితరులు కృతజ్ఞతలు తెలిపారు. బుధవారం బషీర్ బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ రాష్ట్ర జనాభాలో 12 శాతం ఉన్న పద్మశాలీలు ఆనేక ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న తరుణంలో పద్మశాలీ ఫైనాన్స్ కార్పోరేషన్ ఏర్పాటు చేసిన ప్రభుత్వం తగినన్ని నిధులు కేటాయించి ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వ ఉద్యోగులు వారంలో ఒకరోజు విధిగా చేనేత వస్త్రాలు ధరించేలా నిబంధనలు విధించాలన్నారు.

# నియోజకవర్గంలోని సమస్యల పరిష్కారం కోసం పోరాటం

బేగంపేట మార్చి 20, ప్రభాతవార్త : సనత్‌నగర్ నియోజకవర్గం పరిధిలోని ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పోరాటం చేస్తానని సనత్‌నగర్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి,టీ పీ సీ సీ ప్రధాన కార్యదర్శి ,ఏ ఐ సీ సీ సభ్యురాలు డా.కోట నీలిమ అన్నారు.బుధవారం నియోజక వర్గం పరిధిలోని రాంగోపాల్‌పేట డివిజన్ జీరా లో నిర్వహించిన సమావేశంలో పలు సమస్యలపై నేతలతో చర్చించారు. ఈ సందర్భంగా రాంగోపాల్‌పేట డివిజన్ జీరా బస్తీ వాసుల స్థలాలు గతంలో ఎండోమెంట్ పరిధిలో ఉన్న స్థలాలు వారికి సంబంధించినవి కాదని ఉత్తర్వులు ఇచ్చిన నేపథ్యంలో బస్తీవాసుల రికార్డులను పరిశీలించి ప్రస్తుతం ఉన్న చిన్న చిన్న ఇండ్ల స్థానంలో 47 పక్కా ఇండ్ల నిర్మాణానికి సహకరించాలని వారు కోట నీలిమ దృష్టికి తీసుకు రాగా పక్కా ఇండ్ల నిర్మాణానికి కృషి చేస్తానని ఆమె వారికి హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సనత్‌నగర్ నియోజకవర్గం ఏబ్లాక్ అధ్యక్షులు త్రికాల మనోజ్ కుమార్ ముదిరాజ్,రాంగోపాల్‌పేట డివిజన్ ప్రెశిడెంట్ మల్లిఖార్జున్,డీసీసీ సెక్రటరీ హేమంత్ సింగ్,బస్తీ అధ్యక్షుడు నర్సింగరావు,శ్రీకాంత్ చారి,ఎస్.ఆర్.శివ,శ్రీకాంత్,శ్రీనివాస్ పాల్గొన్నారు.

# కార్పొరేషన్ పదవుల్లో ముదిరాజ్‌లకు అన్యాయం

**తెలంగాణ ముదిరాజ్ మహాసభ**


అభివాదం చేస్తున్న అశోక్, రాములు, కనకయ్య తదితరులు

హైదరాబాద్, మార్చి 20,ప్రభాతవార్త: రాష్ట్రంలో 85లక్షలకుపైగా జనాభా కలిగిన ముదిరాజ్‌లకు ఇటీవల జరిగిన కార్పొరేషన్ చైర్మన్‌ల నియామకంలో అన్యాయం జరిగిందని తెలంగాణ ముదిరాజ్ మహాసభ ప్రతినిధులు తెలిపారు. ఈమేరకు బుధవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పల్లెబోయిన అశోక్, ముదిరాజ్ అధ్యయన వేధిక చైర్మన్ ప్రొఫెసర్ రాములు, తమ్మిగారి కనకయ్య ముదిరాజ్ తదితరులు ప్రసంగించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో అత్యదిక జనాభా కలిగిన ముదిరాజ్‌లకు 36 కార్పొరేషన్లలో కేవలం ఒకేఒక్క కార్పొరేషన్‌ను ఇవ్వడం సరికాదన్నారు. అలాగే ఫిషరీస్ కార్పొరేషన్ ముదిరాజ్‌లకు ఇస్తామని చెప్పి ఇతరకులానికి కేటాయించి తమకు అన్యాయం చేశారన్నారు. రాష్ట్రంలో నాలుగువేలకుపైగా సహకార సంఘాలు ఉంటే అందులో మూడువేలకు పైగా ముదిరాజ్‌లు ప్రాతినిథ్యం వహిస్తున్నారన్నారు. అలాగే 2003 ఫిబ్రవరి 19న నాటి కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన జీవో ప్రకారం ముదిరాజ్‌లను బిసిడినుంచి బిసిఏలోకి మార్చాలన్నారు. ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఎన్నికల ముందు మత్స్యకార సామాజిక వర్గాలకు పెండింగ్‌లో ఉన్న సమస్యలు పరిష్కరిస్తామని చెప్పారని వాటిని నెరవేర్చాలన్నారు. అలాగే మెదక్ ఎంపి స్థానంను నీలం మధు ముదిరాజ్‌కు కేటాయించాలని, జెడ్పీచైర్మన్, జెడ్పిటిసి, ఎంపిపి, ఎంపిటిసి, సర్పంచ్ పదవులను జనాభా దామాషా ప్రకారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈసమావేశంలో నాయకులు బొల్ల వెంకట్, మందుల వరలక్ష్మీ, బండి సారంగపాణి తదితరులు పాల్గొన్నారు.

# దేశంలో అప్రజాస్వామిక పాలన నడుస్తుంది

**ఆల్ ఇండియా బ్యాక్వర్డ్ పీపుల్స్ సునామీ పార్టీ జాతీయ అధ్యక్షులు భూపాల్‌గౌడ్**

హైదరాబాద్, మార్చి 20,ప్రభాతవార్త: దేశంలో ప్రస్తుతం అప్రజాస్వామిక పాలన నడుస్తుందని ఆల్ ఇండియా బ్యాక్వర్డ్ పీపుల్స్ సునామీ పార్టీ జాతీయ అధ్యక్షులు భూపాల్‌గౌడ్ అన్నారు. ఈమేరకు బుధవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రతి ఎన్నికల్లో ఓటున్ల డబ్బు పెట్టి కొనడం, అమ్మడం పరిపాటిగా మారిందన్నారు. దీంతో ప్రజాస్వామ్యం అపహాస్యానికి గురవుతుందన్నారు. ఈనేపథ్యంలో ఓట్లు కొన్నవారి ఎన్నికను రద్దు చేయాలని, క్రిమినల్ బ్యాక్‌రౌండ్ ఉన్న వారిని శిక్షించాలని 140 కోటన్ల మంది భారతీయుల పక్షాన సుప్రీంకోర్టులో ఫిల్ వేశానన్నారు. 76సంవత్సరాలుగా రాజకీయం అనేది దేశంలో అవినీతి మయంగా మారిందని దీనిని ప్రజలే తమకు రాజ్యాంగం కల్పించిన ఓటుహక్కు ద్వారా ప్రక్షాళన చేయాలని పిలుపునిచ్చారు.

# నేడు ఎఫ్‌సిడిసిలో ఉచిత వైద్యశిబిరం

హైదరాబాద్, మార్చి 20,ప్రభాతవార్త: వరల్డ్ డౌన్ సింద్రోమ్ డే సందర్భంగా గురువారం మాదాపూర్‌లోని ఫెర్నాండెజ్ చైల్డ్ డెవలప్‌మెంట్ సెంటర్ (ఎఫ్‌సిడిసి) డౌన్ సింద్రోమ్ (జన్యుసంబంధిత వ్యాధి )పిల్లకు ఉచిత వైద్యశిభిరం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు ఓప్రకటనలో తెలిపారు. గురువారం ఉదయం 9గంటల నుంచి మధ్నాహ్నం 2గంటలవరకు ఈశిభిరాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు. చిన్నారుల్లో నత్తి, ఎదుగుదల, ఇతర జన్యుపరమైన లోపాలను గుర్తించి చికిత్స అందించనున్నట్లు తెలిపారు. ఈవైద్యశిభిరంలో డెవలప్‌మెంటల్ పిడియాట్రిక్స్, కార్డియాలజీ, ఎండోక్రినాలజీ, ఆర్థోపెడిక్స్‌లలో ప్రత్యేకత కలిగిన శిశువైద్యులు, జన్యుశాస్త్రవేత్తలు అందుబాటులో ఉంటారన్నారు. ఈశిబిరాన్ని దివీస్‌ఫౌండేషన్ ఫర్ గిఫ్టెడ్ చిల్డ్రన్, నయిదిశల బాగస్వామ్యంలో ఎఫ్‌సిడిసి నిర్వహిస్తుందని పేర్కొన్నారు.

# మతిస్థిమితం లేని వ్యక్తి వీరంగం

అడ్డగుట్ట, మార్చి 20 ప్రభాతవార్త: అడ్డగుట్ట ప్రాంతానికి చెందిన సామ్యేల్ ఓ వ్యక్తి మతి స్థిమితం కోల్పోయి బుధవారం అడ్డగుట్టలో వీరంగం సృష్టించాడు. ఒక చేతిలో రాయి, మరో చేతిలో కర్ర పట్టుకొని ప్రజలను భయభ్రాంతులకు గురి చేశాడు. గతంలో ఆవ్యక్తి కారు మెకానిక్‌గా పనిచేసి మతిస్థిమితం కోల్పోయి సంచరిస్తున్నట్లు స్థానికులు తెలిపారు.

## మల్కాజిగిరిని కైవసం చేసుకుంటాం: బిఆర్ఎస్


ఎమ్మెల్సీ,ఎమ్మెల్యేతో ఎంపి అభ్యర్థి లక్ష్మారెడ్డి

దుండిగల్, మార్చి 20 ప్రభాతవార్త: పార్లమెంటు ఎన్నికల్లో మల్కాజిగిరి స్థానాన్ని బిఆర్ఎస్ భారీ మెజార్టీతో కైవసం చేసుకోవడం ఖాయమని మేడ్చల్ జిల్లా అధ్యక్షులు, ఎమ్మెల్సీ శంభీపూర్‌రాజు, ఎమ్మెల్యే వివేకానంద్‌లు పేర్కొన్నారు. బిఆర్ఎస్ ఎంపి అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి బుధవారం ఎమ్మెల్సీ, ఎమ్మెల్యేలను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈసందర్భంగా ఎమ్మెల్సీ కార్యాలయంలో కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధిలోని ప్రజాప్రతినిధులు, ముఖ్య నేతలతో సమావేశం నిర్వహించారు. పార్లమెంటు ఎన్నికల్లో భారీ విజయాన్ని సొంతం చేసుకోవడంపై చర్చించారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

# సొంత నిధులతో దేవాలయ సాలా గారం నిర్మాణం


సాలా గారాన్ని ప్రారంభిస్తున్న రాజేశ్వరరావు

కెపిహెచ్‌బి కాలనీ, మార్చి 20, ప్రభాతవార్త : కూకట్‌పల్లి నియోజకవర్గం పరిధిలోని బాలానగర్ డివిజన్‌లోని కళ్యాణ్ నగర్‌లో గల కట్ట మైసమ్మ దేవాలయ సాలా గారాన్ని బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వడ్డేపల్లి రాజేశ్వరరావు తన తండ్రి దివంగత నేత వడ్డేపల్లి నర్సింగ్‌రావు జ్ఞాపకార్థం సొంత నిధులతో నిర్మించారు. బుధవారం వేద పండితుల ఆధ్వర్యంలో సాలా గారాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆలయాల ఆవరణలో ఎంతో ప్రశాంతత కలుగుతుందని, యువత ఆధ్యాత్మికం వైపు పయనించాలని అన్నారు. ఇక్కడి ఆలయ అభివృద్ధికి తనవంతు సహాయ సహకారాలు పూర్తిగా ఉంటాయని హామి ఇచ్చారు. ఈ కార్యక్రమంలో దేవాలయ కమిటీ సభ్యులు, బిజెపి నాయకులు, భక్తులు పాల్గొన్నారు.

# మజ్జిగ పంపిణీ


బాటసారులకు మజ్జిగ పంపిణీ చేస్తున్న బీఆర్ఎస్ సీనియర్ నాయకులు సాయిజన్ శేఖర్

నాచారం, మార్చి 20 ప్రభాతవార్త: బాటసారుల దహార్తిని తీర్చేందుకు చలివేంద్రాలు ఎంతో ఉపయోగపడుతాయని బీఆర్ఎస్ సీనియర్ నాయకులు సాయిజన్ శేఖర్ పేర్కొన్నారు. నాచారం ఎర్రగుంటకు చెందిన శ్రీస్వర్ణ హరి చారిటబుల్ ట్రస్ట్ ఆద్వర్యంలో నాచారం వైజయంతి వద్ద మజ్జిగ పంపిణీ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన సాయిజన్ శేఖర్ కేంద్రాన్ని ప్రారంభించి బాటసారులకు మజ్జిగ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో శ్రీస్వర్ణ హరి చారిటబుల్ ట్రస్ట్ హరిబాబు, బీఆర్ఎస్ నాయకులు మేడల మల్లికార్జున్ గౌడ్ స్థానిక నాయకులు కట్టబుచ్చన్న గౌడ్, యాదగిరి, శివకుమార్, మహెందర్, సిధి మల్ల, ప్రతాప్, శంకర్, అనిల్, కర్ణ, నాగరాజు, గద్ద క్రాంతి, శ్యామ్, సాయిరామ్, రఘు, సుశాంత్, మూర్తి, మహెందర్ పొన్నాలతో పాటు పలువురు పాల్గొన్నారు.

## బీజేపీ ఆధ్వర్యంలో అన్న ప్రసాద వితరణ


అన్నం వడ్డిస్తున్న బిజేపీ నాయకులు రాగిరి మోహన్ రెడ్డి, ప్రకాష్ గౌడ్ తదితరులు

నాచారం, మార్చి 20 ప్రభాతవార్త: మేడ్చల్ మల్కాజిగిరి బిజేపీ ఆద్వర్యంలో బుధవారం నాచారం అంబేద్కర్ విగ్రహం అన్నప్రసాద వితర కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా బిజేపీ జిల్లా నాయకులు, రాగిరి మోహన్ రెడ్డి, ఎంపాల పద్మారెడ్డి, పోతగాని గోపాల్ గౌడ్, మల్లెల నర్సింగ్ రావు, అధ్యక్షులు ప్రకాష్ తధితరులు ప్రజలకు అన్నం వడ్డించారు. ఈ సందర్భంగా వారు ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మాట్లాడుతూ బిజేపీ మల్కాజిగిరి అభ్యర్థి ఇటల రాజేందర్ గెలుపు కోసం అందరు కలిసి కట్టుగా సైనికుల్లా పని చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో రవీందర్ రావు, నాయకులు అనితా రెడ్డి, చిల్లా అశోక్, శేఖర్ రెడ్డి, చంద్రమౌలి,రాజి రెడ్డి, గోపి, మంజులతో పాటు పలువురు పాల్గొన్నారు.

# చారిత్రక నవలాచక్రవర్తి అడవి బాపిరాజు

**వేంకటేశ్వర విశ్వవిద్యాలయం పూర్వ వైస్‌చాన్స్‌లర్ ఆచార్య కొలకలూరి ఇనాక్**


ప్రసంగిస్తున్న శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం పూర్వ వైస్‌చాన్స్‌లర్ ఆచార్య కొలకలూరి ఇనాక్

చిక్కడపల్లి, మార్చి 20 ప్రభాతవార్త: జాతియోద్యమ యోధుడు, ఆచార్యుడు, వీటన్నింటికి మించి గొప్ప సహృదయుడు అడవి బాపిరాజు అని శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం పూర్వ వైస్‌చాన్స్‌లర్ ఆచార్య కొలకలూరి ఇనాక్ అన్నారు. శతాబ్దిపూర్వ మహనీయుల యాదిలో కార్యక్రమంలో భాగంగా బుధవారం చిక్కడపల్లి శ్రీ త్యాగరాయ గానసభలోని కళాసుబ్బారావు కళావేదికలో బహుముఖ ప్రజ్ఞాశాలి అడవి బాపిరాజు సంస్మరణ సభ గానసభ అధ్యక్షుడు కళావిఎస్. జనార్దనమూర్తి అధ్యక్షతన జరిగింది. ముఖ్యఅతిథిగా హాజరైన ఆచార్య కొలకలూరి ఇనాక్‌మాట్లాడుతూకవిగా,చిత్రకారుడిగా, శిల్పిగా, కథకుడిగా, నవలారచయితగా, గాయకుడిగా, పత్రికా సంపాదకుడిగా, కళాదర్శకుడిగా ఎంతో పేరును సంపాదించారన్నారు. కాల్పనికోద్యమ కాలంలో బాపిరాజు తెలుగు కవిత్వాన్ని, సృజనాత్మక వచన రచనలనూ కొత్త పుంతలు తొక్కించారని, ఆంధ్రజాతి ప్రాచీనవైభవాన్ని మహోజ్వలంగా దీపింపజేసి జాతియోద్యమ స్ఫూర్తిని రగిలించిన గొప్ప వ్యక్తి బాపిరాజు అని అన్నారు. ఆంధ్రత్వం మూర్తీభవించిన చారిత్రక నవలా రచనలో తనకంటూ ప్రత్యేక స్థానాన్ని నిర్మించుకున్నారన్నారు. ఈ కార్యక్రమంలో ఘంటసాల గానసభ అధ్యక్షుడు కళావిఎస్. జనార్దనమూర్తి, కేంద్ర ఫిలిం సెన్సార్ బోర్డు సభ్యుడు ఎస్‌బి.రామ్, హైకోర్టు న్యాయవాది, గాయనీ తోటశ్రీలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

# మల్కాజ్‌గిని గెలుపే లక్ష్యంగా సమీక్షా సమావేశం


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

కెపిహెచ్‌బి కాలనీ, మార్చి 20, ప్రభాతవార్త: కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు క్యాంప్ కార్యాలయంలో బిఆర్ ఎస్ పార్టీ మల్కాజగిరి ఎంపీ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి గెలుపే లక్ష్యంగా ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, ఎమ్మెల్సీ నవీన్ కుమార్‌ల ఆధ్వర్యంలో నియోజకవర్గ కార్పోరేటర్లు, డివిజన్ అధ్యక్షులు, ముఖ్య నాయకలుతో బుధవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాధవరం మాట్లాడుతూ కూకట్‌పల్లి నియోజకవర్గం నుంచి బిఆర్ఎస్ పార్టీ మల్కాజగిరి ఎంపీ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని పిలుపునిచ్చారు. బిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో నాటి ముఖ్యమంత్రి కెసిఆర్ నాయకత్వంలో కూకట్‌పల్లి నియోజకవర్గాన్ని వేల కోట్ల రూపాయలతో అభివృద్ధి చేశామని ఎక్కడ ఎటువంటి సమస్య ఉన్న ఆనాటి మంత్రి కెటిఆర్ వెంటనే స్పందించి నిధులు విడుదల చేసి అభివృద్ధికి సహకరించారని తెలిపారు. దీనికి కృతజ్ఞతగా మనందరం తిరిగి రాగిడి లక్ష్మారెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని అన్నారు. అలాగే డివిజన్ స్థాయి కార్యకర్తల సమావేశానికి రూపకల్పన చేశారు. ఈ కార్యక్రమంలో కార్పోరేటర్లు, డివిజన్ అధ్యక్షులు, నాయకులు పాల్గొన్నారు.

# దేశ వ్యాప్తంగా కాంగ్రెస్ గాలి వీస్తున్నది: చిన్నారెడ్డి

**విక్రమ్‌యాదవ్ కాంగ్రెస్‌లో చేరిక**


విక్రమ్‌యాదవ్‌కు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న చిన్నారెడ్డి

సైఫాబాద్, మార్చి 20 ప్రభాతవార్త: దేశ వ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీ గాలి విస్తున్నదని, కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం ఖాయమని ప్రణాళిక సంఘం వైస్-చైర్మన్ డాక్టర్ జిల్లెల చిన్నారెడ్డి భరోసా వ్యక్తం చేశారు. గాంధీ భవన్‌లో పలు జిల్లాలతోపాటు జూబ్లీహిల్స్ నియోజక వర్గానికి చెందిన యువ న్యాయవాది, మజ్లిస్ పార్టీ అభ్యర్థిగా ఇబ్రహింపట్నం నియోజకవర్గం నుంచి పోటిచేసిన గొంటి విక్రమ్‌యాదవ్ ఆధ్వర్యంలో మజ్లిస్ పార్టీ, బిఆర్ఎస్ పార్టీ నాయకులు చిన్నిరెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. వారందరికి చిన్నారెడ్డి కండువా కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా చిన్నారెడ్డి మాట్లాడుతూ ఏఐసిసి అగ్రనాయకుడు రాహుల్ గాంధీ దేశంలో చేపట్టిన భారత్ న్యాయ్ జోడో యాత్రకు విశేష స్పందన వస్తున్నదని చెప్పారు. రాష్ట్రంలో 14 లోక్‌సభ స్థానాలను కాంగ్రెస్ పార్టీ కైవసం చేసుకుంటుందని, ఇందుకోసం పార్టీ నాయకులు, కార్యకర్తలు శ్రమించాలని పిలుపునిచ్చారు. గొంటి విక్రమ్‌యాదవ్ మాట్లాడుతూ రాహుల్‌గాంధీని ప్రధాన మంత్రిగా చేయడానికి కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు కంకణభద్దులై పనిచేస్తారని చెప్పారు.

# మహిళలను ఆర్థికంగా అభివృద్ధి చేసేందుకు కృషి

**సఫా స్వచ్ఛంద సంస్థ చైర్మన్ రుబీన్ నఫీజ్ ఫాతిమా**

హైదరాబాద్, మార్చి 20,ప్రభాతవార్త: మహిళలను ఆర్థికంగా అభివృద్ధి చేసేందుకు సఫా స్వచ్ఛంద సంస్థ పనిచేస్తుందని ఆసంస్థ చైర్‌సర్సన్ రుబీన్ నఫీజ్ ఫాతిమా తెలిపారు. ఔత్సాహిక మహిళలను పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దేందుకు తీజరా పేరుతో చేపట్టనున్న కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్‌ను బుధవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇప్పటికే తమ సంస్థ ఆద్వర్యంలో ఎంబ్రాయీ, టైలరింగ్, వంట, ఆరోగ్య, ఇన్ఫార్మేషన్, ఎనేబుల్ట్ సర్వీసెస్, రిటైల్ మేనేజ్మెంట్, మైక్రో ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ తదితర రంగాలోన్ల యువతులు, మహిళలకు శిక్షణ ఇస్తున్నామన్నారు. పేద మహిళలను పారిశ్రామిక వేత్తలుగా తీర్చిదిద్దాలనే ప్రధాన లక్ష్యంతోనే ఈకార్యక్రమంలో నిర్వహిస్తున్నామని దీనికి ప్రభుత్వ సహకారం కూడా తీసుకుంటామన్నారు. ఈకార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు అహ్మద్ అలీ, ఇమామ్ హుస్సేన్, మనీషా గోతి, రిజ్వానా అక్తర్ తదితరులు పాల్గొన్నారు.

## సాయి నాథుని విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం

పేట్‌బషీరాబాద్, మార్చి 20, ప్రభాతవార్త: సుచిత్ర బ్యాంక్ కాలనీలో ఉన్న శ్రీ శిరిడి సాయి నాథుని విగ్రహ ప్రతిష్టా మహోత్సవం మే నెలలో ఘనంగా నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఏప్రిల్ 1వ తేదీ సాయంత్రం గణపతి పూజ, స్వస్తి పుణ్యాహ వచనం రక్షాబంధనం మృత్సంగ్రహణం అంకురార్పణ దీక్షా స్వీకరిణ, మే 2వ తేదీ గణపతి పూజ, పుణ్యాహవచనం, అగ్ని ప్రతిష్ట ద్వార పూజ గణపతి హోమం, రుద్రహవనం, పూర్ణాహుతి, సాయంత్రం ఆదివాస హోమం, పూర్ణాహుతి, జల, క్షీర ఆదివాసం, తీర్థ ప్రసాద వితరణ. 3వ తేదీ ద్వార పూజ, యాగశాలలో మహాలక్ష్మీ హోమం, మన్యుసూక్త హవనం పూర్ణాహుతి, అభిషేకం, సాయంత్రం యాగశాలలో అదివాసం హోమాలు, వాస్తు హోమం, వాస్తు పర్యగ్నీకరణం, ధ్యాన్య, ఫల, పుష్ప శయ్యధివాసము నిర్వహిస్తారు. 4వ తేదీన ద్వారపూజ యాగశాలలో ప్రాణ ప్రతిష్టా న్యాస హోమం, మహాపూర్ణాహుతి, ఉదయం 09:05గంటలకు సుముహూర్తమున విగ్రహ ప్రతిష్ఠ ప్రథమ ఆరాధన స్వామి దర్శనం కుంభ ప్రోక్షణ వేద ఆశీర్వచనం. మధ్యాహ్నం హారతి తరువాత మహా ప్రసాదం అన్నదాన వితరణ నిర్వహిస్తానమి కమిటీ సభ్యులు తెలిపారు.

# దైవ ప్రార్థన ద్వారానే మానసిక పరిపక్వత.. మనశ్శాంతి

**కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కె.పి.వివేకానంద్**


రుడామిస్త్రినగర్‌లోని కురు మరియమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే కె.పి.వివేకానంద్, కార్పొరేటర్ రావుల శేషగిరిరావు, ఆలయ కమిటీ అధ్యక్షులు తంగవేలు, చిన్నస్వామి, ఆర్ముగం, జగన్,అంబి, జయచంద్రన్, తమిళ్‌శ్రీకాంత్, చంద్రశేఖర్, గోపి, శివకుమార్, బాస్కర్

కుత్బుల్లాపూర్, మార్చి 20 ప్రభాతవార్త: దైవ ప్రార్థన ద్వారానే మానసిక పరిపక్వత, మనశాంతి లభిస్తుందని కుత్బుల్లాపూర్ శాసనసభ్యులు కె.పి.వివేకానంద్ అన్నారు.చింతల్ డివిజన్ రొడామిస్త్రినగర్‌లోని కురుమరియమ్మ ఆలయ వార్శికోత్సవ సందర్భంగా కార్పొరేటర్ రావుల శేషగిరిరావు, శ్రమశక్తి అవార్డుగ్రహీత ఎత్తరి మారయ్యలతోపాటు పాల్గొన్నారు.ఈసందర్భంగా ఆలయ కమిటీ అధ్యక్షులు ఆలయ కమిటీ అధ్యక్షులు తంగవేలు, చిన్నస్వామి, ఆర్మూగం, జగన్,అంబి, జయచంద్రన్, తమిళ్‌శ్రీకాంత్, చంద్రశేఖర్, గోపి, శివకుమార్, బాస్కర్‌ల ఆధ్వర్యంలో నిర్వహించిన వార్శికోత్సవ ప్రత్యేకపూజా కార్యక్రమాలలో ఆయన పాల్గొన్నారు. కార్యక్రమంలో టిఆర్ఎస్ నాయ కులు బసవరాజు, న్యూ ఎల్‌బి.నగర్ సంక్షేమ సంఘ అధ్యక్షులు కె.వెంకటేశ్‌గౌడ్, శేఖర్‌రావు, న్యాయవాది కమలాకర్, జగద్గిరిగుట్ట శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయకమిటీ చైర్మెన్ వేణుయాదవ్, గాజులరామారం గోవర్థన్‌రెడ్డి,రంగానగర్ సంక్షేమ సంఘ అధ్యక్షులు బండారు వరప్రసాద్ గుప్తా, మహేశ్ ఆలయ కమిటీ అధ్యక్షులు తంగవేలు, సభ్యులు చిన్నస్వామి, జగన్, ఆర్ముగం, అంబి, జయచంద్రన్, చంద్రశేఖర్, గోపి, తమిళ్ శ్రీకాంత్, శివకుమార్, బాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా శ్యామ్‌బాబా శోభయాత్ర


శోభయాత్రలో పాల్గొన్న సేనా రాష్ట్ర అధ్యక్షులు ఎన్.ఆర్.లక్ష్మన్‌రావుగుప్త

అఫ్జల్‌గంజ్,మార్చి 20ప్రభాతవార్త: నగరంలో బుధవారం ఏకాదశిని పురస్కరించుకుని పలుచోట్ల నుంచి శ్యామ్‌బాబా శోభయాత్రను ఘనంగా నిర్వహించారు. గోషామహల్ నియోజకవర్గంలోని పలు స్వచ్ఛందసంస్థలు, దేవాలయాలనుంచి,యువజన సంఘాల ఆద్వర్యంలో ఉత్తరభారతీయులు కుటుంబసమేతంగా చేతులల్లోజెండాలను పట్టుకుని కాచిగూడలోని వీరన్నగుట్టపై ఉన్న శ్యామ్ బాబా మందిరానికి శోభయాత్రకు బయలుదేరారు. పలుచోట్ల స్వాగత వేదికలను వేసి శోభయాత్రలకు స్వాగతంపలికారు.తెలంగాణ భజరంగ్‌సేనా ఆద్వర్యంలో శోభయాత్రగా బయలుదేరారు.ఈకార్యక్రమంలో సేనారాష్ట్ర అధ్యక్షులు ఎన్.ఆర్.లక్ష్మన్‌రావుగుప్త, ఉపాధ్యక్షులు ఎర్రం శ్రీనివాస్,సిటి అధ్యక్షులు రాజారాంఆశీష్‌వ్యాస్ పాల్గొన్నారు.

## అయ్యప్పస్వామి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం

పేట్‌బషీరాబాద్, మార్చి 20, ప్రభాతవార్త: సుచిత్ర, శ్రీ రాఘవేంద్ర కాలనీ, శ్రీ హరిహర క్షేత్రము అయ్యప్ప దేవాలయంలో ఈ నెల 22వ తేదీన శ్రీశ్రీశ్రీ వినాయక, రాఘవేంద్ర స్వామి సుబ్ర హ్మణ్య స్వామి, మాలికపురదేవి సహిత పంచలోహ శ్రీ అయ్యప్పస్వామి విగ్రహ ప్రతిష్ట మహోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. భక్తు లు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారి ఆశీస్సులు పొంది, తీర్థ ప్రసాదాలు స్వీకరించాలని కోరారు.

# వివేక్‌నగర్ శ్రీ ఆంజనేయస్వామి దేవాలయం ఆదాయం రూ.లక్ష12వేల953


హుండీ ఆదాయాన్ని లెక్కిస్తున్న సిబ్బంది

చిక్కడపల్లి, మార్చి 20 ప్రభాతవార్త: వివేక్‌నగర్ శ్రీ ఆంజనేయ స్వామి దేవాలయం హుండి లెక్కింపు బుధవారం జరిగింది. నెల రోజులకుగాను ఆలయానికి రూ.లక్ష12వేల953 ఆదాయం లభించింది. ఆలయం ఈవో మాచర్ల దేవనాథం, ఇన్‌స్పెక్టర్ బి.సురేఖ పర్యవేక్షణలో ఈ కార్యక్రమం జరిగింది. అర్చకులు బుగ్గల క్ష్మీపతిశర్మ, కె.వెంకటాద్రి, కె.కృష్ణమూర్తి, ఆచారి, శివ పాల్గొన్నారు.

## ఒంటింటి మహిళలకు రూ.2వేలు అమలు కాకపోవడం సిగ్గుచేటు

చిక్కడపల్లి, మార్చి 20 ప్రభాతవార్త: రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి 100 రోజుల పూర్తి అయినా కూడా ఇంతవరకు 'చేయూత' పథకం కింద రూ.2వేలు ఒంటరి మహిళలకు ఇప్పటికీ ఇవ్వకపోవడం సిగ్గుచేటని బిఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు సిరిగిరి శ్యామ్ విమర్శించారు. బుధవారం రామ్‌నగర్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికలకు ముందు ఓట్ల కోసం ఆచరణ సాధ్యంకానీ హామీలను గుప్పించిన కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఇచ్చిన హామీని పూర్తిగా తుంగలోకి తొక్కిందని, ఒంటరి మహిళలు ఎంతో ఆశగా తమకు రూ.2వేలు వస్తాయని ఆశపడ్డారని, కానీ అధికారంలోకి వచ్చి మూడు నెలలు కావస్తున్నా ఇంతవరకు ఆ విషయంపై దృష్టిని కేంద్రీకరించకపోవడం పేద ఒంటరి మహిళలను మోసం చేయడమేనని విమర్శించారు.

## ఓటర్లు ఎలాంటి ప్రలోభాలకు గురికావొద్దు -సిఐ శ్రీను


ప్రజలతో మాట్లాడుతున్న సిఐ శ్రీను

**చేర్యాల (మద్దూరు), మార్చి 20, ప్రభాతవార్త**

ఓటు హక్కును కలిగి ఉన్న ప్రతి ఒక్కరు ఎలాంటి ప్రలోభాలకు గురికావొద్దని చేర్యాల సిఐ శ్రీను తెలిపారు. బుధవారం మద్దూరు మండలంలోని కొండపూర్ గ్రామంలో పర్యటించి అక్కడి ప్రజలతో మాట్లాడారు. యువకులు మత్తుపదార్థాలకు అలవాటు పడకుండా తల్లిదండ్రులు గమనిస్తుండాలని, సైబర్‌నేరాలపై అవగాహన కల్పించారు. అలాగే క్రిటికల్ పోలింగ్ కేంద్రాలను కూడా సందర్శించారు. సిఐతో మద్దూరు ఏఎస్సై జగదీశ్వర్, పోలీస్ సిబ్బంది ఉన్నారు.

## ఓటు హక్కు విలువను తెలుసుకోవాలి -తహసీల్దార్ రవిందర్‌రెడ్డి


ప్రతిజ్ఞ చేయిస్తున్న తహశీల్దార్ రవిందర్‌రెడ్డి

**హుస్నాబాద్, మార్చి20, ప్రభాతవార్త :**

విద్యార్థులు ఓటు హక్కుతో పాటు ఓటు విలువను గురించి తెలుసుకోవాలని తహశీల్దార్ రవిందర్‌రెడ్డి అన్నారు. బుధవారం రోజున జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని పట్టణ కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణంలోని జిల్లా పరిషత్ పాఠశాల నుండి అంబేద్కర్ చౌరస్తా వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో పాటు ప్రజలతో ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం మాట్లాడుతూ విద్యార్థి దశ నుండే ఓటు హక్కు, విలువను గురించి అవగాహన కలిగి ఉండడం చాలా అవసరమన్నారు. ఓటు హక్కు, వినియోగం, విలువలపై వారికి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో డిటి దేవేంద్ర, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు వాసుదేవరెడ్డి, రెవెన్యూ సిబ్బందితో పాటు బిఎల్‌వోలు పాల్గొన్నారు.

## చలివేంద్రాల ఏర్పాటు అభినందనీయం

**-బిజెపి పట్టణ అధ్యక్షులు, కౌన్సిలర్ శ్రీనివాస్**

**హుస్నాబాద్, మార్చి20, ప్రభాతవార్త**

ఎండలు మండిపోతున్న సందర్భంగా హుస్నాబాద్ నియోజకవర్గ వ్యాప్తంగా బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు జన్నపురెడ్డి సురేందర్‌రెడ్డి చలివేంద్రాలు ఏర్పాటు చేయడం అభినందనీయమని బిజెపి పట్టణ అధ్యక్షులు, కౌన్సిలర్ దొడ్డి శ్రీనివాస్ అన్నారు. బుధవారం పట్టణంలోని మల్లెచెట్టు చౌరస్తాతో పాటు ప్రభుత్వ ఆసుపత్రి చౌరస్తా వద్ద జెఎస్ఆర్(జన్నపురెడ్డి సురేందర్‌రెడ్డి) సొంత ఖర్చులతో ఏర్పాటు చేసిన చలివేంద్రాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గత నాలుగేళ్లుగా జేఎస్ఆర్ ఎండాకాలంలో నియోజకవర్గ ప్రజలకు చలివేంద్రాలు ఏర్పాటు చేయడం సంతోషకరమైన విషయమన్నారు. చలివేంద్రాలు ఏర్పాటు చేసిన నేపథ్యంలో సురేందర్‌రెడ్డికి హుస్నాబాద్ ప్రజల పక్షాన ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు తిరుమల, స్వరూప, సమ్మయ్య, లక్ష్మణ్, ఆకోజు అరుణ్, చందు భూశంకర్, రాజు, సాయి, నరేష్‌తో పాల్గొన్నారు.

## రైతు పోరాటాలను గుర్తించడం హర్షనీయం


మాట్లాడుతున్న రవిందర్‌గౌడ్

**హుస్నాబాద్, మార్చి20, ప్రభాతవార్త**

రైతు పోరాటాలను కాంగ్రెస్ పార్టీ గుర్తించడం హర్షనీయం అని రైతు రక్షణ సమితి నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి పచ్చిమట్ల రవిందర్‌గౌడ్ అన్నారు. బుధవారం పట్టణ కేంద్రంలో మాట్లాడుతూ ఢిల్లీలో దాదాపు 30వేల మంది రైతులు కేంద్ర ప్రభుత్వం స్వామినాధన్ కమిటీ సూచించిన మేరకు 22 పంటలకు మద్దతు ధరలు ప్రకటించాలని ధర్నాలు చేస్తున్నారని వాటిని కేంద్రం పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. రైతుల పక్షపాతిగా కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్‌గాంధీ నేడు కాంగ్రెస్ మేనిఫెస్టోలో రైతులకు మద్దతు ధరతో పాటు పంటలు నష్టపోయిన రైతులకు నెల రోజులలోపే పరిహారం చెల్లిస్తామని హామీ ఇవ్వడం సంతోషకరమైన విషయమన్నారు. రైతు పోరాటాలను గుర్తించిన కాంగ్రెస్ పార్టీకి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు కొముఏరయ్య, భూమయ్య, సాంబమూర్తి, ఎల్లయ్యతో పాటు తదితరులు పాల్గొన్నారు.

## వడగండ్ల వానతో నష్టపోయిన పంటల పరిశీలిన

**బెజ్జంకి, మార్చి 20, ప్రభాతవార్త :**

మండల కేంద్రంలో కురిసిన వడగండ్ల వర్షం కారణంగా మొక్కజొన్న వరి, మామిడి పంటలు నష్టపోయిన రైతులను బుధవారం మండల వ్యవసాయ అధికారి సంతోష్‌తో కలిసి కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు ముక్కిస రత్నాకర్‌రెడ్డి అధ్వర్యంలో కాంగ్రెస్ నాయకులు పంట నష్టపోయిన రైతులను పరామర్శించారు. నష్టపోయిన రైతులకు ప్రభుత్వం నుంచి నష్టపరిహారం అందేలా కృషి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు పోచయ్య, ప్రవీణ్, శ్రీనివాస్‌రెడ్డి, మల్లేశం, ప్రభాకర్, తిరుపతి, ఐలయ్య, శ్రీకాంత్, జిల లింగం, అనిల్, దేవిశెట్టి అంజనేయులు, తిరుపతిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.


నష్టపోయిన వరి పంటను పరిశీలిస్తున్న కాంగ్రెస్ నాయకులు

# ఓటు హక్కు, సైబర్ నేరాలపై అవగాహన

**మర్కుక్ మార్చి 20 (ప్రభాతవార్త):**

పార్లమెంట్ ఎన్నికల్లో భాగంగా పోలీస్ కమిషనర్ ఆదేశాల మేరకు మంగళవారం మండల పరిధిలోని పాములపర్తిలో ఎస్ఐ మధుకర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఓటు హక్కు, సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓటు హక్కు ఉన్న ప్రతి ఒక్కరూ ఓటును వినియోగించుకోవాలని సూచించారు. ఓటు వజ్రాయుధమని, ప్రజాస్వామ్య దేశంలో ఓటు హక్కు ద్వారా ప్రజా ప్రతినిధులను ఎన్నుకోవడం జరుగుతుందని, ఓటు యొక్క ప్రాధాన్యత చాలా గొప్పదని అన్నారు. ఎలాంటి ప్రలోభాలకు లోనుకాకుండా ప్రజలు తమ ఓటును వినియోగించుకోవాలని తెలిపారు. ఓటు విషయంలో ఎవరైనా బెదిరింపులకు పాల్పడితే సంబంధిత పోలీస్‌స్టేషన్‌కు సమాచారం ఇవ్వాలని లేదా పోలీస్ కంట్రోల్ రూం 8712667100 లేదా 100కు కాల్ చేయాలని సూచించారు. మద్యానికి, డబ్బులకు, మరే ఇతర వస్తువులకు ఓటును అమ్ముకోవద్దని, మీకు నచ్చిన అభ్యర్థికి నిజాయతీగా, నిర్భయంగా ఓటువేసి ఓటింగ్ శాతం పెంచాలని తెలిపారు. ప్రశాంతమైన వాతావరణంలో పార్లమెంట్ ఎన్నికలు జరిపించడానికి అన్ని రకాల ప్రణాళికలు తయారు చేయడం జరిగిందన్నారు. గ్రామాల్లో ఏ పార్టీ వారు వచ్చి ప్రచారం చేసినా అడ్డుకోవద్దని, ప్రజాస్వామ్య దేశంలో ఎవరైనా ప్రచారం చేసుకోవచ్చని, ఎవరైనా అడ్డుకుంటే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. క్రిటికల్ పోలింగ్ స్టేషన్లలో పారా మిలటరీ దళాలతో పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఎన్నికల కోడ్‌ను ప్రతి ఒక్కరూ పాటించాలని సూచించారు. సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని, గుర్తు తెలియని వ్యక్తులు ఏదైనా లింక్ పంపిస్తే ఓపెన్ చేయవద్దని, ఓపెన్ చేసి డబ్బులు పంపించి మోసపోవద్దని సూచించారు. ఏదైనా సైబర్ నేరం జరిగితే వెంటనే జాతీయ సైబర్ సెల్ హెల్ప్‌లైన్ నెం.1930 కాల్ చేసి ఫిర్యాదు చేయాలన్నారు.


పాములపర్తిలో ప్రజలకు అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ మధుకర్‌రెడ్డి

# జీవకోటికి నీరు ప్రాణాధారం

**-ప్రతి చుక్కను ఒడిసిపట్టి భావితరాలకు అందించాలి**



కార్యక్రమంలో మాట్లాడుతున్న పీస్ సంస్థ డైరెక్టర్ నిమ్మయ్య

**జగదేవ్‌పూర్, మార్చి 20 (ప్రభాతవార్త):**

జీవి మనుగడ సాధించాలంటే జీవకోటికి ఆధారం నీరు అని ఉమ్మడి మెదక్ జిల్లా నాబార్డు డిడిఎం సెశిల్ తిమూతి అన్నారు. జగదేవ్‌పూర్ మండలకేంద్రంలోని పీస్ స్వచ్ఛంద సంస్థలో బుధవారం వాటర్‌షెడ్ ప్రాజెక్టులను గ్రామ కమిటీలకు అప్పగించే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన నాబార్డు డిడిఎం సెషిల్ తిమూతి మాట్లాడుతూ వర్షపు నీటిని భూగర్భ జలాలుగా మార్చేందుకు నాబార్డు గోద్రేజ్ సహకారంతో వాటర్‌షెడ్ ప్రాజెక్టులను గొల్లపల్లి, మునిగడప గ్రామాల్లో నిర్వహించి రైతుల యొక్క బోరుబావుల భూగర్భజలాలు పెంచడం జరిగిందన్నారు. నీరు లేకపోతే మానవ మనుగడ లేదని, ప్రతి ఒక్కరూ నీటిని వృధా చేయకుండా ప్రతి నీటి చుక్కను ఒడిసిపట్టి భావితరాలకు అందించాలన్నారు. పీస్ స్వచ్ఛంద సంస్థ డైరెక్టర్ కె.నిమ్మయ్య మాట్లాడుతూ గొల్లపల్లి, మునిగడప వాటర్‌షెడ్ ప్రాజెక్టులను 2023 జూన్ 30 నాటికి ముగియడంతో ఆ ప్రాజెక్టులు చేపట్టిన స్ట్రక్చర్స్‌ను నిర్వహించుటకు, నిర్వహణ పనులను సక్రమంగా నిర్వహించుటకు అవగాహన కల్పించి గ్రామ వాటర్‌షెడ్ కమిటీలకు అప్పగించడం జరుగుతుందన్నారు. నాబార్డు గోద్రేజ్ వారి సహకారంతో ఈ ప్రాజెక్టు నిర్వహించి గ్రామాల్లో జీవనోపాధి కల్పించి చెట్ల పెంపకం, నీటి సంరక్షణ ద్వారా ఏడు గ్రామాలకు సహకారం అందించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో వాటర్‌షెడ్ కమిటీ చైర్మన్‌లు నర్సింలు, స్వరూప, లక్ష్మి, కమిటీ మెంబర్స్, పీస్ సంస్థ కో-ఆర్డినేటర్ మహేష్, వినయ్‌కుమార్, మల్లేష్, ముత్యం, మాక్స్ మేనేజర్స్ శోభారాణి, వెంకటలక్ష్మి, పద్మ, భాగ్యలక్ష్మి, మొహినొద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

# రైతులు అధైర్యపడొద్దు...ధైర్యంగా ఉండాలి

**-పంటలు నష్టపోయిన రైతులకు ప్రభుత్వం అండగా నిలుస్తుంది**

**-కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గం ఇంచార్జి : పూజల హరికృష్ణ**

**సిద్దిపేట రూరల్, మార్చి 20, ప్రభాతవార్త :**

వడగళ్ల వానతో పంటలు, కూరగాయల తోటలు నష్టపోయిన రైతులు అధైర్య పడాల్సిన అవసరం లేదని కాంగ్రెస్ ప్రభుత్వం అండగా ఉంటుందని సిద్దిపేట నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి పూజల హరికృష్ణ తెలిపారు. సిద్దిపేట అర్బన్ మండల పరిధిలోని ఇమాంబాద్‌లో వడగళ్ల వానతో నష్టపోయిన పంటలు, కూరగాయల తోటలను పరిశీలించి రైతులకు భరోసా కల్పించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ నష్టపోయిన పంటలను అంచనాలు వేసి ప్రభుత్వానికి పంపించాలని అధికారులను కోరినట్లు తెలిపారు. నియోజకవర్గంలో పంటల నష్టాన్ని మంత్రులు దామోదర రాజనరిసింహ, పొన్నం ప్రభాకర్, ఇంచార్జి మంత్రి కొండా సురేఖ, సిఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి పరిహారం అందేలా తన వంతు కృషి చేస్తానని తెలిపారు. పంటలు, కూరగాయల తోటలు నష్టపోయిన ప్రతి రైతుకు న్యాయం చేసేలా కృషి చేస్తానని తెలిపారు. రైతులు అధైర్యపడకుండా ధైర్యంగా ఉండాలని ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. అయన వెంట పార్టీ నాయకులు నాయిని నర్సింహ్మారెడ్డి, మీసం నాగరాజు యాదవ్, గుర్రం అంజిరెడ్డి, మంద పాండు, ఎల్లయ్య, బంక చిరంజీవి, వహబ్, సత్యనారాయణ, రాజిరెడ్డి, భాస్కర్, దిలీప్ తదితరులు ఉన్నారు.


నష్టపోయిన పంటలను పరిశీలిస్తున్న కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి హరికృష్ణ

## పోషకాహారంతోనే తల్లీ, బిడ్డకు ఆరోగ్యం : ఐసిడిఎస్ సూపర్వైజర్ శ్రీలక్ష్మి


పోషకాహారంపై అవగాహన కల్పిస్తున్న ఐసిడిఎస్ సూపర్వైజర్ శ్రీలక్ష్మి

**గజ్వేల్ టౌన్, మార్చి 20 (ప్రభాతవార్త):**

పోషకాహారం తీసుకున్నప్పుడే తల్లీ, బిడ్డ ఆరోగ్యంగా ఉంటారని గజ్వేల్ ఐసిడిఎస్ సూపర్వైజర్ శ్రీలక్ష్మి పేర్కొన్నారు. పోషణ వారోత్సవాల్లో భాగంగా బుధవారం గజ్వేల్ సెక్టార్ పరిధిలోని 10వ అంగన్‌వాడీ కేంద్రంలో గర్భిణీ స్త్రీలు, బాలింతలకు పోషకాహారంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఐసిడిఎస్ సూపర్వైజర్ శ్రీలక్ష్మి మాట్లాడుతూ గర్భిణీ స్త్రీలు, బాలింతలు ప్రతిరోజూ తీసుకునే ఆహారంలో చిరు ధాన్యాలు ఉండేలా చూసుకోవాలని, చిరుధాన్యాలలో పుష్కలమైన పోషక విలువలు ఉంటాయని పేర్కొన్నారు. అలాగే అంగన్‌వాడీ కేంద్రాలలో చిన్నారులకు పోషకాలతో కూడిన ఆహారాన్ని అందివ్వడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమానికి హాజరైన డాక్టర్ రాహుల్, డాక్టర్ గౌతమిలు మాట్లాడుతూ గర్భిణీ స్త్రీలు పౌష్టికాహారంతో పాటు పండ్లు తీసుకోవాలన్నారు. పోషక విలువలు ఉన్న ఆహారాన్ని తీసుకుంటేనే ఆరోగ్యంగా ఉంటారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు, మహిళలు పాల్గొన్నారు.

## మున్సిపల్‌లోని ప్రజలందరూ ఇంటి పన్ను చెల్లించాలి -మున్సిపల్ కమిషనర్ గోల్కొండ నర్సయ్య


మున్సిపల్ కమిషనర్‌కు చెక్కు అందజేస్తున్న వివో బయోటెక్ యాజమాన్యం

**గజ్వేల్ టౌన్, మార్చి 20 (ప్రభాతవార్త):**

గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని వివో బయోటెక్ పరిశ్రమ యొక్క ఇంటి పన్ను రూ.7,48,234 వసూలు చేసినట్లు గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపల్ కమిషనర్ గోల్కొండ నర్సయ్య తెలిపారు. బుధవారం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ 2023-24కు సంబంధించిన ఇంటి పన్నును వివో బయోటెక్ యాజమాన్యం పూర్తిగా చెల్లించడం జరిగిందని తెలిపారు. ఆర్థిక సంవత్సరం ముగుస్తున్నందున మున్సిపాలిటీలోని ప్రజలందరూ ఇంటిపన్ను త్వరగా చెల్లించి సహకరించాలన్నారు.

## చెక్‌పోస్టులో విధులు నిర్వహించే సిబ్బంది అప్రమత్తంగా ఉండాలి : సిఐ శ్రీను


వాహనాలను తనిఖీ చేస్తున్న పోలీసులు

**చేర్యాల, మార్చి 20, ప్రభాతవార్త :** చెక్‌పోస్టులో విధులు నిర్వహించే సిబ్బంది ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండాలని చేర్యాల సిఐ ఎల్. శ్రీను సిబ్బందికి తెలియజేశారు. చేర్యాల మండలం ముస్త్యాల గ్రామంలో సిఐ శ్రీను, ఎస్సై దామోదర్‌తో పాటు సిబ్బందితో కలిసి బుధవారం చెక్‌పోస్టును ఏర్పాటు చేసి వాహనాలను తనిఖీ చేశారు. పార్లమెంట్ ఎన్నికల దృష్ట్యా ఓటర్లను ప్రలోభాలకు గురిచేసేందుకు ఇతర ప్రాంతాల నుండి మద్యం, నగదు, ఇతర నిషేధిత పదార్థాలు, వస్తువుల రవాణా చేస్తుంటారని వాటిని అరికట్టేందుకు పటిష్టమైన చర్యలు చేపట్టినట్లు వారు తెలిపారు. వచ్చిపోయే ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేయాలని తనిఖీలు చేసేటప్పుడు సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని సూచించారు. రాత్రి సమయాల్లో తనిఖీ చేసేటప్పుడు టార్చ్ లైట్ తప్పక ఉపయోగించుకోవాలని సిబ్బందికి సూచించారు.

# మన్నె వెంకటేష్ మృతి బాధాకరం

**-మృతుని కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలి**

**గజ్వేల్, మార్చి 20 (ప్రభాతవార్త):**

వడగండ్ల వానతో మృతిచెందిన మన్నె వెంకటేష్, పంట నష్టపోయిన రైతు కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలని డిబిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి దాసరి ఏగొండస్వామి, జిల్లా ప్రధాన కార్యదర్శి బ్యాగరి వేణులు డిమాండ్ చేశారు. బుధవారం గజ్వేల్ ప్రభుత్వాసుపత్రిలో మన్నె వెంకటేష్ మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి అంబులెన్స్‌లో కొల్గూరు గ్రామానికి తరలించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఏగొండస్వామి, వేణులు మాట్లాడుతూ గజ్వేల్ మండలం కొల్గూరు గ్రామానికి చెందిన 10వ తరగతి చదువుతున్న మన్నె వెంకటేష్ వడగండ్ల వాన వల్ల చెట్టు విరిగి తలపై పడి మృతిచెందాడని, వెంకటేష్ మృతి బాధాకరమన్నారు. అలాగే మంగళవారం కురిసిన వడగండ్ల వానతో పంటలు తీవ్రంగా నష్టపోయాయని, పంట నష్టపరిహారాన్ని ప్రభుత్వం ఇవ్వాలని డిమాండ్ చేశారు. మన్నె వెంకటేష్ కుటుంబానికి రూ.20 లక్షల ఆర్థిక సహాయం అందించాలని డిమాండ్ చేశారు.


మన్నె వెంకటేష్ మృతదేహాన్ని గ్రామానికి తరలిస్తున్న దృశ్యం

## అకాల వర్షంతో అగమవుతున్న రైతులు


వడగండ్ల వానతో నెలకొరిగిన పంట చేను

**బెజ్జంకి, మార్చి 20, ప్రభాతవార్త :**

మండల కేంద్రంలో మంగళవారం రాత్రి కురిసిన వర్షం కారణంగా మొక్కజొన్న, మామిడి, పొద్దు తిరుగుడు, వరి పంటలకు నష్టం వాటిల్లిందని రైతులు అవేదన వ్యక్తం చేస్తున్నారు. మండల వ్యాప్తంగా అయా గ్రామాల్లో ఈదురుగాలులతో కూడిన వడగండ్ల వాన కురవడంతో కాత దశలో ఉన్న మామిడి, మొక్కజొన్న పంటలు పూర్తిగా నెలకొరిగాయి. మండలంలోని లక్ష్మీపూర్, వడ్లూరు, బేగంపేట, గూడెం, దాచారం గ్రామాల్లో 1050 ఎకరాలు మొక్కజొన్న 42 ఎకరాల్లో పొదుతిరుగుడు పంట నష్టపోగ, రేగులపల్లి గ్రామంలో కోత దశలో ఉన్న 50 ఎకరాల వరి నెలపాలైందని మండల వ్యవసాయ అధికారులు తెలిపారు. ఈ మేరకు మండల వ్యవసాయ అధికారి సంతోష్ వ్యవసాయ విస్తరణ అధికారులు అయా గ్రామాల్లో పర్యటించి ప్రభుత్వానికి నివేదిక అందిస్తామని తెలిపారు.

## ఘనంగా పోషణ సంబరాలు


పోషకాహారంపై అవగాహన కల్పిస్తున్న ఐసిడిఎస్ సూపర్వైజర్ రజిత

**జగదేవ్‌పూర్, మార్చి 20 (ప్రభాతవార్త):**

జగదేవ్‌పూర్ మండల పరిధిలోని చాట్లపల్లి గ్రామంలో ఐసిడిఎస్ ఆధ్వర్యంలో బుధవారం అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ సంబరాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గర్భిణీ స్త్రీలకు, బాలింతలకు పోషక విలువలతో కూడిన ఆహారాన్ని అందించారు. ఈ సందర్భంగా ఐసిడిఎస్ సూపర్వైజర్ రజిత మాట్లాడుతూ గర్భిణీ స్త్రీలు సరైన పోషకాలులేని ఆహారం తీసుకున్నట్లయితే తల్లీ, బిడ్డల ఆరోగ్యం బాగుండదని, తల్లి, బిడ్డ ఆరోగ్యంగా ఉండాలంటే పోషక విలువలతో కూడిన బలమైన ఆహారాన్ని తీసుకోవాలన్నారు. అదేవిధంగా అంగన్‌వాడీ కేంద్రంలో 0-3 సంవత్సరాల పిల్లలకు పోషక పదార్థాలు కలిగిన ఆహారాన్ని అందిస్తున్నామని, పిల్లలలో పోషకాహార లోపం వచ్చినట్లయితే అనారోగ్యానికి గురవుతారని, తల్లిదండ్రులు పిల్లలకు సరైన పోషక పదార్థాలు కలిగిన ఆహారాన్ని అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి సాయిబాబా, అంగన్‌వాడీ టీచర్ లక్ష్మి, ఏఎన్‌ఎం మంజుల, ఆశ వర్కర్ మమత, మహిళలు పాల్గొన్నారు.

## ఘనంగా శ్రీ సీతారాముల రథోత్సవం


రథోత్సవంలో పాల్గొన్న ప్రజా ప్రతినిధులు, భక్తులు

**మర్కుక్, మార్చి 20 (ప్రభాతవార్త):**

మండల పరిధిలోని పాములపర్తి రామాలయం 15వ వార్షికోత్సవం గత రెండు రోజుల నుండి ఘనంగా జరుగుతున్నాయి. ఇందులో భాగంగా బుధవారం శ్రీ సీతారాముల రథోత్సవ ఊరేగింపు గ్రామంలోని పురవీధుల గుండా భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి పాండుగౌడ్, నాచారం మాజీ చైర్మన్ హరిపంతులు, ముదిరాజ్ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు మేకల కనకయ్య, నాయకులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

## ఉత్తమ సేవా పతకం అందుకున్న చేర్యాల ఏఎస్సై నవీన్


చేర్యాల ఏఎస్సైకి ఉత్తమ సేవా పతకాన్ని అందిస్తున్న సిపి అనురాధ

**చేర్యాల, మార్చి 20, ప్రభాతవార్త**

విధి నిర్వహణలో భాగంగా ఉత్తమ సేవలందించిన పోలీసు అధికారులకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక సేవా పతకాలు ప్రకటించింది. అందులో భాగంగానే మంగళవారం జిల్లా పోలీస్ కమీషనర్ అనురాధ చేర్యాల పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న ఏఎస్సై నవీన్‌కు ఉత్తమ సేవా పతకాన్ని అందజేశారు. ఈ సందర్భంగా పోలీసు అధికారులతో పాటు సిబ్బంది ఏఎస్సైని అభినందించారు.

## కొమురవెల్లికి చేరుకున్న మహాపాదయాత్ర



ధర్మ సభలో మాట్లాడుతున్న జనగామ డీసీసీ అధ్యక్షులు ప్రతాప్‌రెడ్డి

**కొమురవెల్లి, మార్చి 20, ప్రభాతవార్త :**

సనాతన హిందూ ధర్మ జాగతిలో భాగంగా శ్రీ అది జగద్గురు రేణుకాచార్యుల జయంతి ఉత్సవాలలో భాగంగా శ్రీ సద్గురు మహాదేవ్ స్వామిజి అధ్వర్యంలో మహారాష్ట్ర నుంచి యాదాద్రి జిల్లా కొలనుపాక వరకు నిర్వహించే మహాపాద యాత్ర బుధవారం కొమురవెల్లి మల్లికార్జున స్వామి దేవాలయంకు చేరుకుంది. కార్యక్రమంలో భాగంగా స్వామి వారిని దర్శించుకున్న అనంతరం ధర్మ సభను ఏర్పాటు చేశారు. సభలో శ్రీ సిద్ధాంత శిఖామణి ప్రవచనం సనాతన హిందూ ధర్మంపై ప్రవచనం చేశారు. మాజీ ఎంపి సురేష్ షెట్కార్, జనగామ డీసీసీ అధ్యక్షులు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి, వీరశైవ లింగాయత్ సమాజం రాష్ట్ర నాయకులు నరుకుల్ల శివప్ప, దేవాలయం చైర్మన్ పర్పాటకం లక్ష్మారెడ్డి తదితరులు మాట్లాడారు. కార్యక్రమంలో మండల లింగాయత్ అధ్యక్షులు మహాదేవుని శ్రీనివాస్, అలయ ప్రధాన అర్చకులు మహాదేవుని మల్లికార్జున్, వీరశైవ లింగాయత్ సమాజం నాయకులు బర్మని మల్లికార్జున్, పట్లోళ్ల మల్లికార్జున్ సూరం కరుణాకర్, ఉప్పు సాంబశివుడు, పడిగన్నగారి నాగయ్య, మహాదేవుని శేషు, పడిగన్నగారి అంజనేయులు, మల్లేశం, ఉప ప్రధాన అర్చకులు విజయకుమార్, అర్చకులు భాస్కర్, మనోహర్, రవి, వినయ్, రేవణ సిద్దేశ్వర్ పాల్గొన్నారు.


బిఆర్ఎస్ నాయకులతో సమావేశమైన ఎమ్మెల్యే, బిఆర్ఎస్ ఎంపి అభ్యర్థి

## పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు బుద్ధి చెబుదాం

**బిఆర్ఎస్ ముఖ్య నాయకులతో ఎమ్మెల్యే, ఎంపి అభ్యర్థి**

**న్యాల్‌కల్, మార్చి 20, ప్రభాతవార్త:** శాసనసభ ఎన్నికల్లో కాంగ్రెస్‌పార్టీ చేసిన హామీలను ఏ మేరకు అమలు చేశారో తేటతెల్లమయిందని, రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో ఓట్లతో కాంగ్రెస్‌కు తగు రీతితో బుద్ధి చెప్పాల్సిన అవసరం ఉందని ఎమ్మెల్యే కొనింటి మాణిక్‌రావు, జహీరాబాద్ పార్లమెంట్ బిఆర్ఎస్ అభ్యర్థి గాలి అనిల్‌కుమార్ అన్నారు. మండలంలోని ఎస్ఎస్ ఎస్వీలో బిఆర్ఎస్ నాయకులతో సమావేశం ఏర్పాటు చేశారు. సమావేశానికి ఎమ్మెల్యే కొనింటి మాణిక్‌రావు, ఎంపి అభ్యర్థి గాలి అనిల్‌కుమార్ హాజరు కాగా నాయకులు గజమాలతో సత్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే, ఎంపి అభ్యర్థిలు నాయకులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో బిఆర్ఎస్ మండల అధ్యక్షులు మున్నూర్ రవీందర్, జడ్పిటిసి సభ్యులు బోడ స్వప్నభాస్కర్, మండల మాజీ అధ్యక్షులు ఎల్‌చెల్ నర్సింహారెడ్డి, పార్టీ మండల ప్రధాన కార్యదర్శి మాతంశెట్టి రాజ్‌కుమార్, నాయకులు రాజుపాటిల్, వీరారెడ్డి, మాజీ సర్పంచ్‌లు, ఎంపిటిసిలు పాల్గొన్నారు.

## షాపూర్‌లో భూమ్ గొండేశ్వర విగ్రహావిష్కరణ


భూమ్‌గొండేశ్వర విగ్రహావిష్కరణలో పాల్గొన్న నగేష్ శెట్కార్

**నాగల్‌గిద్ద, మార్చి 20, ప్రభాతవార్త:** మండలంలోని షాపూర్ గ్రామంలో బుధవారం భూమ్ గొండేశ్వర విగ్రహావిష్కరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఉమ్మడి జిల్లా ప్రణాళిక సంఘం మాజీ సభ్యులు నగేశ్‌కుమార్‌శెట్కార్ హాజరై విగ్రహాన్ని ఆవిష్కరిం చారు. కార్యక్రమంలో టిపిసిసి సభ్యులు శంకరయ్యస్వామి, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మాణిక్‌రావు పాటిల్, నాయకులు జగ్గు పాటిల్, విజయ్ కుమార్ స్వామి, శ్రీకాంత్ స్వామి తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ అధ్యక్షుడిని పరామర్శించిన మంత్రి


సదానందం కుటుంబాన్ని పరామర్శిస్తున్న దామోదర్ రాజనర్సింహ

**అల్లాదుర్గం, మార్చి 20, ప్రభాతవార్త:** కాంగ్రెస్ పార్టీ అల్లాదుర్గం గ్రామ అధ్యక్షుడు ఈదునూరి సదానందం సోదరుడు సంతోష్ కుమార్తె అక్షర (2) ఇటీవల మృతి చెందినట్లు తెలుసుకున్న రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సి.దామోదర్ రాజనర్సింహ బుధవారం కుటుంబ సభ్యులను పరామర్శిం చారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు శేషారెడ్డి, నాయకులు బి.బలరాం, సదానందం, మద్దూరి సురేష్‌గౌడ్, ఎం.సుధాకర్, దొంత లక్ష్మయ్య, కొంక శ్రీశైలం, మరక రాములు, కురుమ నాగయ్య, కురుమ మహేష్, మదర్ తదితరులు పాల్గొన్నారు.

## మాజీ మంత్రి గీతారెడ్డిని సన్మానించిన చైర్మన్


మాజీ మంత్రి గీతారెడ్డిని సన్మానిస్తున్న ఎఫ్‌డిసి చైర్మన్ గిరిధర్‌రెడ్డి

**జహీరాబాద్, మార్చి 20, ప్రభాతవార్త:** రాష్ట్ర ఫిలిం డెవలప్‌మెంట్ సంస్థ కార్పొరేషన్ చైర్మన్‌గా నియమితులైన ఎన్ గిరిధర్‌రెడ్డి బుధవారం మాజీ మంత్రి డాక్టర్ జెట్టి గీతారెడ్డిని మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. బుధవారం గిరిధర్‌రెడ్డి హైదరాబాద్‌లోని గీతారెడ్డి నివాసానికి చేరుకుని మర్యాదపూర్వకంగా కలుసుకుని పూలబొకేను అందించి శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో తెలంగాణ ఫుడ్‌కార్పొరేషన్ సంస్థచైర్మన్ ఎంఏ ఫహీం ఉన్నారు.

## నేడు మండల సర్వసభ్య సమావేశం

**జహీరాబాద్, మార్చి 20, ప్రభాతవార్త:** ఈ నెల 21వ తేదీన ఉదయం 11.30 గంటలకు ఎంపిపి అధ్యక్షులు గిరిధర్‌రెడ్డి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశాన్ని ఏర్పాటు చేసినట్లు మండల పరిషత్ అభివృద్ధి అధికారి మహేందర్‌రెడ్డి తెలిపారు. సమావేశానికి ఆయా శాఖల అధికారులు పూర్తి నివేదికలతో హాజరు కావాలన్నారు. మండల సభ్యులు సమావేశానికి సమయానికి హాజరై సభను సద్వినియోగం చేసుకోవాలన్నారు.

## బీబీపాటిల్‌ను కలిసిన బిజెపి నాయకులు

**నర్సాపూర్, మార్చి 20, ప్రభాతవార్త:** జహీరాబాద్ పార్లమెంట్ బిజెపి అభ్యర్థి బీబీపాటిల్ ను బుదవారం నర్సాపూర్ వచ్చిన సందర్భంగా నర్సాపూర్ బిజెపి నాయకుల ఆయనను మర్యాధ పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనను సాదారంగా ఆహ్వానించి స్వాగతం పలికి శాలూవాతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా బిజెపి నాయకులు మాట్లాడుతూ జహీరాబాద్ పార్లమెంట్ అభ్యర్థిగా ఎన్నికల బరిలో ఉన్న బీబీపాటిల్‌ను గెలిపించేందుకు కృషి చేస్తామన్నారు. ఈమేరకు జహీరాబాద్ పార్లమెంట్ స్తానంలో బిజెపి విజయం సాధిస్తుందన్నా ధీమాను వారు వ్యక్తం చేశారు. ఈ జహీరాబాద్ పార్లమెంట్ బిజెపి అభ్యర్థి బీబీ పాటిల్‌ను కలిసినవారిలో బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మురళీయాదవ్, బిజెపి ఓబిసి మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షులు పాపగారి రమేశ్‌గౌడ్, మాజీ సర్పంచ్ హన్మంతు వెంకటరమణారావు, బిజెపి పట్టణ అధ్యక్షులు ఆంజనేయులుగౌడ్, బిజెపి నాయకులు తదితరులున్నారు.


బీబీపాటిల్‌ను కలిసిన నర్సాపూర్ బిజెపి నాయకులు

# వెంకటేశ్వరస్వామి ఆలయంలో ధ్వజస్థంభం ప్రతిష్టాపన

**పాల్గొన్న మంత్రి దామోదర్ రాజనర్సింహ**

**అల్లాదుర్గం, మార్చి 20, ప్రభాతవార్త:** మండల కేంద్రంలోని శ్రీవెంకటేశ్వరస్వామి దేవాలయంలో ధ్వజ స్థంభం ప్రతిష్టాపన వేద బ్రాహ్మణుల వేదమంత్రాలు మధ్య ఘనంగా కొనసాగింది. ఈకార్యక్రమానికి వైద్యఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ హాజరై ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయంలో గణపతి పూజ, ధ్వజస్థంభం పూజ, హోమం పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం మంత్రి దామోదర్ రాజనర్సింహ మాట్లాడుతూ ఆలయ అభివృద్ధికి తన వంతు సహకారం అందిస్తానన్నారు. అన్నదాన కార్యక్రమాలు నిర్వహించుకునేందుకు షెడ్‌నిర్మాణానికి సహకరిస్తానన్నారు. ప్రభుత్వ పరంగా ప్రత్యేక నిధులు మంజూరు అయ్యేలా కృషిచేస్తానని చెప్పారు. కార్యక్రమంలో ఎంపిపి అధ్యక్షులు అనిల్‌కుమార్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు శేషారెడ్డి, ఎస్సీ సెల్ జిల్లా ఉపాధ్యక్షుడు బలరాం, ఎంపిటిసి సభ్యులు, కాంగ్రెస్ నాయకులు విఠల్‌రెడ్డి, దుర్గయ్య, మాజీ సర్పంచ్ శ్రీనివాస్, శ్రీశైలం, సాయిలు, జయపాల్ నాయక్, సదానందం, సురేష్, కురుమ నాగయ్య, బాలరాజు, శ్రీను శేఖర్, దేవభూషణం, కురుమ మహేష్, మార్క రాములు, ఎం.సుధాకర్, నాగిశెట్టి, మదర్ దొంత లక్ష్మయ్య పాల్గొన్నారు.


వెంకటేశ్వర స్వామి ఆలయంలో పూజలు చేస్తున్న మంత్రి దామోదర్ రాజనర్సింహ


ఎమ్మెల్యే రోహిత్‌రావుకు వినతిపత్రం సమర్పిస్తున్న దృశ్యం

## బ్రహ్మంగారి గుడి నిర్మాణానికి స్థలం ఇవ్వాలి

**రామాయంపేట, మార్చి 20, ప్రభాతవార్త :**మనుమయ సంఘం కార్యవర్గ సభ్యులు రామాయంపేటలో ఎమ్మెల్యే రోహిత్‌రావుకు వినతిపత్రం ఇవ్వడం జరిగింది. బ్రహ్మంగారి గుడికోసం స్థలాన్ని కేటాయించాలని అలాగే సంఘ భవన నిర్మాణానికి స్థలాన్ని కేటాయించి నిధులు ఇవ్వాలని వారు కోరారు. ఇట్టి విషయం పైన ఎమ్మెల్యే స్పందిస్తూ తప్పక మీ కోరికలు నెరవేరుస్తామని మాట ఇవ్వడం జరిగింది. ఇట్టి కార్యక్రమంలో విశ్వకర్మ మనుమయ సంఘం మండల అధ్యక్షులు కొడపర్తి లక్ష్మణాచారి, పట్టణాధ్యక్షులు కమ్మరి యాదగిరిచారి, ఉపాధ్యక్షులు కొడపర్తి పాండురంగ చారి, ప్రధాన కార్యదర్శి నరేందర్‌చారి, సుంకోజు దామోదర్‌చారి, వెంకటేశంచారి, కమ్మరి చంద్రమౌళిచారి, దమ్మయ్యగారి శ్రీనివాసచారి, కోనాపురం వెంకటేశం చారి, రాములు చారి పాల్గొన్నారు.

## నందనవనంగా తీర్చిదిద్దుతాం


అప్పాజీపల్లిలో సీసీ రోడ్డు పనులను ప్రారంభించిన దృశ్యం

**కొల్చారం, మార్చి 20, ప్రభాతవార్త:** కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో అప్పాజీపల్లి గ్రామాన్ని నందనవనంగా తీర్చిదిద్దుతామని కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షుడు సయ్యద్ ఫాహద్ పాషా ఖాదరి, నాయకులు నాయిని నాగరాజు గౌడ్, సందీప్‌గౌడ్ అన్నారు. కొల్చారం మండలం అప్పాజీపల్లి గ్రామానికి మహాత్మగాంధీ జాతీయ ఉపాధి హామి నిధులు ద్వారా అభివృద్ధి పనులకు రూ. 5 లక్షల మంజూరయ్యాయని, దీంతో ఎన్నో ఏళ్ల నుండి మట్టితో ఉన్న రహదారిలో కాంగ్రెస్ పార్టీ నేతలు సిమెంట్ రోడ్డు పనులకు శ్రీకారం చుట్టారు. గ్రామంలో సీసీ రోడ్డు పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ నేతలు ఫాహద్ పాషా ఖాదరి, నాగరాజు గౌడ్, సందీప్‌గౌడ్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో అప్పాజీపల్లి గ్రామాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చెస్తామన్నారు. ప్రజలు పడుతున్న కష్టాలు చూసి ఈ ప్రాంతంలో సీసీ రోడ్లు నిర్మాణానికి శ్రీకారం చుట్టామన్నారు.

## గీతంలో ప్రపంచ నోటి ఆరోగ్య దినోత్సవం

**పటాన్‌చెరు, మార్చి 20, ప్రభాతవార్త:** గీతం స్కూల్ ఆఫ్ ఫార్మసీ(జీఎస్పీ) హైదరబాద్ బుధవారం ప్రపంచ నోటి ఆరోగ్య దినోత్సవాన్ని నిర్వహించారు. పరిశుభ్రమైన నోరే ఆరోగ్యకరమైన దేహం అనే ఇతివృత్తంతో జరిగిన ఈ కార్యక్రమంలో రూట్ కెనాల్, ఫెషియల్ ట్రామా కేర్ స్పెషలిస్ట్ డాక్టర్ రాము నోముల ముఖ్యఅతిథిగా హాజరై సంపూర్ణ ఆరోగ్యాన్ని కాపాడుకోవడంలో నోటి పరిశుభ్రతను నొక్కి చెప్పారు. నోటి ఆరోగ్యం, దేహిక ఆరోగ్యసమస్యల మధ్య సంబంధాన్ని డాక్టర్ రాము ప్రస్తావిస్తూ, నోటి నుంచి బ్యాక్టీరియా రక్త ప్రవాహంలోకి ప్రవేశించి శరీరంలోని ఇతర భాగాలపై ప్రభావం చూపుతుందన్నారు. పళ్ల మధ్య ఖాళీలు, చిగుళ్ల వ్యాధి, నోటి దుర్వాసన వంటి సాధారణ దంత సమస్యలను నివారించడంలో క్రమబద్దంగా బ్రెష్ చేసుకోవడం, ఫ్లాసింగ్ వంటి మంచి నోటి పరిశుభ్రత పద్దతులను ఆయన వివరించారు. ఆత్మీయ అతిథిగా పాల్గొన్న కాస్మెటిక్ డెంటల్ సర్జన్ డాక్టర్ మౌనిక మాట్లాడుతూ సరైన జీర్ణక్రియ ఆత్మగౌరవం, ఇరుగుపోరుగుతో సులువుగా కలవడం వంటి వాటి కోసం నోటిని ఆరోగ్యకరంగా ఉంచుకోవడం ఎంతో అవసరమన్నారు. రోజుకు రెండు సార్లు మెత్తటి బ్రష్‌తో పళ్లు తోడుదం, నాలుకను ప్రతిరోజు శుభ్రంచేయడం, చెక్కరను పరిమితంగా తీసుకోవడం, దంత వైద్యుడిని క్రమం తప్పకుండా సందర్శించడం, మరెన్నో నోటి పరిశుభ్రత పద్దతులను ఆమె వివరించారు. గీతం స్టూడెంట్ లెఫ్ట్, గీతం ఫార్మసీ స్టూడెంట్ అసోసియేషన్ సహకారంతో నిర్వహించిన నోటి ఆరోగ్య అవగాహన శిబిరంలో అతిథులిద్దరు పాల్గొని తగు సూచనలు చేశారు. తొలుత గీతం స్కూల్ ఆఫ్ ఫార్మసీ ప్రిన్సిపల్ ప్రొఫెసర్ శివకుమార్ అతిథులను సత్కరించారు. అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ పవన్ కుమార్, చింతమనేని కార్యక్రమాలను సమన్వయం చేశారు.


ఎమ్మెల్యే మాణిక్‌రావు వాహనాన్ని తనిఖీ చేస్తున్న పోలీసులు

## ఎమ్మెల్యే వాహనాన్ని తనిఖీ చేసిన పోలీసులు

**జహీరాబాద్, మార్చి 20, ప్రభాతవార్త:** రానున్న పార్లమెంట్ ఎన్నికలను పురస్కరించుకుని కోడ్ విడుదల కావడంతో చెక్ పోస్టు వద్ద అటుగా వస్తున్న వాహనాలను పోలీసులు తనిఖీ చేస్తున్నారు. బుధవారం ఎమ్మెల్యే కొనింటి మాణిక్‌రావు కారులో న్యాల్‌కల్ మండలంలోని బిఆర్ఎస్ ముఖ్య నాయకులతో సమావేశం అయేనయందుకు వెళుతున్న క్రమంలో చెక్ పోస్టు వద్ద పోలీసులు వాహనాన్ని ఆపి తనిఖీ చేశారు.

## మోడి ప్రధానిగా హ్యాట్రిక్ తప్పదు

**-బిజెపి ఎంపి అభ్యర్థి రఘునందన్‌రావు**


మాట్లాడుతున్న రఘునందన్‌రావు

**గజ్వేల్, మార్చి 20 (ప్రభాతవార్త):** దేశంలో ముచ్చటగా మూడోసారి ప్రధానమంత్రి నరేంద్రమోడి కావడం తథ్యమని మెదక్ పార్లమెంట్ బిజెపి అభ్యర్థి రఘునందన్‌రావు పేర్కొన్నారు. బుధవారం గజ్వేల్ పట్టణంలోని ప్రజ్ఞా గార్డెన్‌లో గజ్వేల్ నియోజకవర్గ బిజెపి కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మెదక్ పార్లమెంట్ అభ్యర్థి రఘునందన్‌రావు పాల్గొని మాట్లాడుతూ దేశంలో బిజెపి పార్టీకి 400 ఎంపి సీట్లు వస్తాయని, నరేంద్రమోడి చరిత్ర సృష్టించబోతున్నారన్నారు. ఎక్కడ చూసినా బిజెపి బలపడుతుందని అంటున్నారని, రాష్ట్రంలో 17 ఎంపి సీట్లను బిజెపి పార్టీ కైవసం చేసుకుంటుందన్నారు. మెదక్ పార్లమెంట్ అభ్యర్థిగా నన్ను మీరందరూ భారీ మెజార్టీతో గెలిపించాలని, మెదక్ పార్లమెంట్‌లో బిజెపి జెండా ఎగరవేయడానికి కార్యకర్తలు కష్టపడాలన్నారు.

**గాడిపల్లి భాస్కర్‌ను పరామర్శించిన రఘునందన్‌రావు**

గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మాజీ మున్సిపల్ చైర్మన్ గాడిపల్లి భాస్కర్‌ను మెదక్ పార్లమెంట్ బిజెపి అభ్యర్థి రఘునందన్‌రావు వారి నివాసానికి వెళ్ళి పరామర్శించారు. గత నెల రోజుల క్రితం గాడిపల్లి భాస్కర్‌కు బైపాస్ సర్జరీ కాగా విషయం తెలుసుకున్న రఘునందన్‌రావు ఆయనను పరామర్శించారు. ఆయనతోపాటు బిజెపి జిల్లా అధ్యక్షుడు మోహన్‌రెడ్డి, బిజెపి రాష్ట్ర నాయకులు ధరం గురువారెడ్డి, కప్పర ప్రసాద్‌రావు, సింగం సత్తయ్య, నందన్ గౌడ్, కుడిక్యాల రాములు, సాయిబాబా, బండారు మహేష్, ఎల్కంటి సురేష్, దేవులపల్లి మనోహర్‌యాదవ్ తదితరులు ఉన్నారు.

## పేకాట స్థావరంపై పోలీసుల దాడి

**చేర్యాల, మార్చి 20, ప్రభాతవార్త :** పేకాటస్థావరంపై మంగళవారం రాత్రి టాస్క్‌ఫోర్స్ అధికారులు, పోలీసులు దాడులు నిర్వహించి ఇద్దరిని అదుపులోకి తీసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం చేర్యాల మండలం చుంచనకోట గ్రామ శివారులో బొడిగం నర్సారెడ్డి మామిడితోటలో కొందరు వ్యక్తులు పేకాట ఆడుతున్నారని నమ్మదగిన సమాచారం అందడంతో సిద్దిపేట టాస్క్‌ఫోర్స్ అధికారులు, చేర్యాల పోలీసులు రైడ్ చేయడంతో ఇద్దరు పారిపోగా మరో ఇద్దరిని పట్టుకుని వారి నుండి రూ.31,410/-, 6మొబైల్ ఫోన్లు, ఒక కారు, పదివేల టోకెన్ కాయిన్స్, పేక ముక్కలను స్వాధీనం చేసుకుని చేర్యాల పోలీసులు కేసు నమోదు చేశారు.


నగదుతో పాటు పేకాట రాయుళ్లను చూపిస్తున్న పోలీసులు


నర్సాపూర్‌లో కవాతు నిర్వహిస్తున్న పోలీసులు

## నర్సాపూర్‌లో పోలీసుల కవాతు

**నర్సాపూర్, మార్చి 20, ప్రభాతవార్త:** పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో ప్రజలకు ఆత్మవిశ్వాసం కల్గించేందుకు బుధవారం సిఐ జాన్‌రెడ్డి, ఎస్ఐ పుష్పరాజ్ ఆధ్వర్యంలో నర్సాపూర్ పట్టణంలో, మండల పరిధిలోని చిన్న చింతకుంట గ్రామంలో సిఐఎస్ఎఫ్ సెంట్రల్ ఫోర్స్, పోలీసులు కవాతు (ఫ్లాగ్‌మార్చ్) నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐ జాన్‌రెడ్డి మాట్లాడుతూ పార్లమెంట్ ఎన్నికల్లో ప్రజలను అప్రమత్తంగా ఉండేందుకు కవాతు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రజలు ఎటువంటి అల్లర్లు, అలజడులు లేకుండా స్వేచ్ఛగా ఓటుహక్కును వినియోగించుకోవాలని ఆయన సూచించారు. పోలీసులపై ప్రజలు నమ్మకంగా ఉండేందుకుగాను ఈ కవాతు ఉపయోగపడుతుందన్నారు. ఎన్నికల్లో ప్రజలు పోలీసులకు సహకరించాలన్నారు. అంతేగాక ప్రజలకు, ఓటర్లకు ఎటువంటి సమస్యలు తలెత్తినా పోలీసుల సహకారం ఉంటుందని సిఐ జాన్‌రెడ్డి చెప్పారు.

## అంబేద్కర్ భవన్‌లో కరపత్రం ఆవిష్కరణ

**సంగారెడ్డి టౌన్, మార్చి 20, ప్రభాతవార్త:** బాబు జగ్జీవన్ రామ్ 117వ జయంతిని పురస్కరించుకుని బుధవారం సంగారెడ్డిలోని అంబేద్కర్ భవన్ లో జయంతి కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా బాబు జగ్జీవన్ రామ్ సమతా సంఘం సంగారెడ్డి జిల్లా నూతన కమిటీని ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా బంగారు కృష్ణ, ప్రధాన కార్యదర్శిగా ఎల్.వేణుగోపాల్, సహాయకార్యదర్శిగా పోలీస్ రాంచందర్, అసోసియేట్ అధ్యక్షులుగా ఆనంద్ రావు, కోశాధికారిగా అందెల మొగులయ్య, సహాయ కోశాధికారిగా తొగర్‌పల్లి సునీల్, గౌరవ అధ్యక్షులుగా డప్పు రమేష్, అధికార ప్రతినిధిగా కాశపాగ ఇమ్మయ్య, ఉపాధ్యక్షులుగా ముక్కగల్ల బిక్షపతి, నక్క సూర్యకుమార్, అలిగే రాజు, మచునూరి చంద్రశేఖర్, ప్రకాశ్ కుప్పానగర్, మీడియా ప్రతినిధులుగా డి.అశోక్, రమణిఅశోక్, ప్రభు, ఉల్లాస్, దామగల్ల మురహరి, పొట్టిగళ్ల మోహన్, జిల్లా సలహాదారులుగా పల్పనూరి శేఖర్, న్యా సలహాదారులుగా మాతంగి చిరంజీవి, కార్యదర్శులుగా గంగేరి శ్రీనివాస్, డప్పు మాణిక్యం, మాసన్నగారి నాగరాజు, సిహెచ్.రమేష్, నడిమిదొడ్డి దూబెన్, జిల్లా కమిటీ సభ్యులుగా రాజీవ్ మీదిదొడ్డి, అబ్రహం, సొన్నాయిల బి.బండారి, ఏర్పుల విశాల్, ఎం.శ్రీకాంత్, డప్పు నవీన్ తదితరులు పాల్గొన్నారు.

## నత్నాయపల్లిలో కలుషిత నీరు సరఫరా

**ఇబ్బందులు పడుతున్న గ్రామస్థులు**

**నర్సాపూర్, మార్చి 20, ప్రభాతవార్త:** మండల పరిధిలోని నత్నాయపల్లి గ్రామంలో వాటర్‌ట్యాంక్ నుండి కలుషిత తాగునీరు సరఫరా కావడంతో ప్రజలు అవస్థలు పడుతున్నారు. వాటర్‌ట్యాంక్‌లో నాచు, పాకుడు వంటి నీరు పచ్చగా సరఫరా అవుతున్నట్లు గ్రామస్తులు తెలిపారు. దీంతో గ్రామస్తులు నీటిని తాగుదామన్నా, వాడుకుందామన్నా భయపడుతున్నారు. సంవత్సరం కాలం నుండి ఇదేవిధంగా నీరు సరఫరా అవుతున్నా ఎవరూ పట్టించుకోవడం లేదని సిపిఐ నాయకులు జాజాల దుర్గయ్య తెలిపారు. వాటర్‌ట్యాంక్‌ను శుభ్రం చేయకపోవడంతో ఈ పరిస్థితి దాపురించిందని చెప్పారు. గ్రామ కార్యదర్శికి వినతిచేసినా ఫలితం లేకపోయిందని అన్నారు. కాగా ప్రస్తుతం సర్పంచ్‌లకు పదవీకాలం ముగిసినందున గ్రామ కార్యదర్శి పట్టించుకోవాలన్నారు. ఇప్పటికైన సంబంధిత అధికారులు, గ్రామ కార్యదర్శి స్పందించి నత్నాయపల్లిలో కలుషిత నీరు రాకుండా చర్యలు తీసుకోవాలని గ్రామస్థులతో పాటు జాజాల దుర్గయ్య కోరుతున్నారు.

## విజయవంతంగా ముగిసిన వైద్య ఆరోగ్య శిబిరం

**రామాయంపేట (కూచారం), మార్చి 20, ప్రభాతవార్త :**

ఆరోగ్యానికి మించిన సంపద లేదని నేటి సామాజిక పరిస్థితిలో ఆరోగ్యం మహాభాగ్యంగా భావిస్తూ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ రాష్ట్ర కో ఆర్డినేటర్ కె. స్వర్ణలత అన్నారు. కూచారం గ్రామంలో రైతు వేదిక యందు ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ రాష్ట్ర శాఖ మెదక్ జిల్లా శాఖ, వివిఎస్‌టి ఇండస్ట్రీస్, హైదరాబాద్ వారి సహకారంతో నిర్వహించిన వైద్య ఆరోగ్య శిబిరంలో 500 మందికి పైగా వృద్దులకు వివిధ వ్యాధుల రుగ్మతలు కలిగినవారికి అన్ని విభాగాల్లో ఉచిత ఆరోగ్య శిబిరంలో పాల్గొన్న వారి నిర్దేశించి ఆరోగ్య శిబిరం ముఖ్య నిర్వాహకులు రాష్ట్ర మేనేజ్‌మెంట్ కమిటీ నెంబర్ సింగం శ్రీనివాస్‌రావు మాట్లాడుతూ శిబిరాలను నిర్వహిస్తూ రెడ్‌క్రాస్ శాఖ విస్తృతంగా సేవలందిస్తున్నాయని అన్నారు. మెదక్ జిల్లా చైర్మెన్ డాక్టర్ ఏలేటి రాజశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర శాఖ పిలుపుమేరకు కాళ్లకల్, కూచారంలో మెగా ఆరోగ్య శిబిరాలను నిర్వహిస్తూ ఉచితంగా మందులు పంపిణీ చేయడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ డాక్టర్ వికాస్ మరియు వారి సిబ్బంది, వి.ఎస్.టి కోఆర్డినేటర్ గోపికృష్ణ మెదక్ శాఖ ప్రధాన కార్యదర్శి టి.సుభాష్‌చంద్రబోస్, మెదక్ శాఖ ఎంసి మెంబర్ వి.సతీష్‌రావు అలాగే గ్రామ పెద్దలు, మాగ్నస్ సిబ్బంది, పాల్గొన్నారు.

**అకాల వర్షంతో నష్టపోయిన**

## రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి

**భారతీయ కిసాన్ సంఘ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పన్యాల వెంకటరెడ్డి**

**నిజాంపేట, మార్చి 20, ప్రభాతవార్త :** మండల వ్యాప్తంగా మూడు రోజుల క్రితం కురిసిన అకాల వర్షానికి రైతులు దాదాపుగా 90 శాతం తమ పంటలను కోల్పోయారని భారతీయ కిసాన్ సంఘ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు అన్నారు. మొక్కజొన్న పడిపోయిందని అదేవిధంగా వరి పూర్తిగా రాలిపోయిందని మామిడి పిందెలు రాలిపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. మూలిగేనక్కపై తాటిపండు పడినట్లు అసలే నష్టాలతో ఉన్న రైతన్నలకు ఈ అకాల వర్షం పెద్ద ఇబ్బందిగా మారిందని రైతులు అప్పు తీసుకొచ్చి పెట్టుబడి పెట్టిన పంటలు నేడు రైతులను అప్పుల ఊబిలోకి నెట్టేస్తున్నాయన్నారు. వ్యవసాయ అధికారులను క్షేత్రస్థాయిలో పంపించి నష్ట పరిహారం చర్యలను వెంటనే తీసుకోవాలని నష్టపోయిన రైతులకు ఎకరానికి రూ. 25వేల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు రాజ శ్రీకాంత్‌రెడ్డి, కార్యదర్శి అనిల్‌కుమార్, మండల అధ్యక్షులు రాజ్యం, రైతులు పాల్గొన్నారు.


తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న భారతీయ కిసాన్ సంఘం నేతలు

## ప్రమాదవశాత్తు చెరువులో పడి ఇద్దరు మృతి

**టేక్మాల్, మార్చి 20, ప్రభాతవార్త:** ప్రమాదవశాత్తు చెరువులో పడి ఇద్దరు మృతి చెందిన సంఘటన బుధవారం టేక్మాల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని బొడ్మట్‌పల్లి, గొల్లగూడెం గ్రామల్లో జరిగింది. టేక్మాల్ ఎస్ఐ మురళి కథనం ప్రకారం... రామయణంపేట మండలంలోని తునిగండ్ల గ్రామానికి చెందిన గొర్రెల కాపారి జంగంపల్లి రాములు(55) గొర్రెల మేపుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో బొడ్మట్‌పల్లి గ్రామంలో గొర్రెలు మేపుతూ సమీపంలోని చెరువులో గొర్రెలకు నీళ్ల తాపేందుకుగాను వెళ్లి కాలు జారి ప్రమాదవశాత్తు చెరువులో పడి మృతి చెందాడని తెలిపారు. చెరువులో పడి బయటకు రాకపోవడంతో గజ ఈతగాళ్లను రప్పించి మృతదేహాన్ని వెలికితీసి పోస్టు మార్టంకు తరలించారు. ఎస్ఐ మురళి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన చెప్పారు.

అదేవిధంగా మండల పరిధిలోని గొల్లగూడెం గ్రామానికి చెందిన నీరుడి కిష్టమ్మ (56)నపంతులు చెరువులో ప్రమాదవశాత్తు కాలు జారి పడి మృతి చెందినట్లు గ్రామస్తులు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

# ప్రభుత్వ పరంగా పంట నష్టపరిహారం చెలిస్తాం : ఎమ్మెల్యే

**నిజాంపేట, మార్చి 20, ప్రభాతవార్త :**

భారీ గాలులతో రెండు రోజుల క్రితం వడగండ్ల వాన కురిసిన నేపథ్యంలో నిజాంపేట మండలంలోని జడ్చర్ల తాండాలోని ధ్వంసమైన పంట పొలాలను ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ బుధవారం పరిశీలించి రైతులను పరామర్శించారు. పంట నష్టపోయిన రైతులు ఎమ్మెల్యేతో మాట్లాడుతూ తమ పంటలు అకాలవర్షంవల్ల పూర్తిగా ధ్వంసం అయ్యాయని ఆదుకోవాలని కోరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతులు అధైర్యపడవద్దని, నష్టపోయిన వరి, మొక్కజొన్న పంటకు ప్రభుత్వ పరంగా నష్టపరిహారాన్ని సత్వరమే అందించేలా చర్యలు తీసుకుంటానని హామినిచ్చారు. పంట నష్టపోయిన వివరాలు సత్వరమే ప్రభుత్వానికి సమర్పించాలని జిల్లా కలెక్టర్‌తో పాటు వ్యవసాయశాఖ అధికారులకు సూచించారు.

**మృతుడి కుటుంబాన్ని పరామర్శ...**

మండల కేంద్రానికి చెందిన బక్కోల్ల బాలమల్లయ్య ఇటీవల విద్యుత్ షాక్‌తో మృతిచెందాడు. ఈ విషయాన్ని కాంగ్రెస్ నాయకులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లగా విద్యుత్ ప్రమాదంలో మృతి చెందిన బాలమల్లయ్య నివాసానికి ఎమ్మెల్యే వెళ్లి వారి కుటుంబాన్ని పరామర్శించారు. విద్యుత్ ఘాతంలో బాలమల్లయ్య మరణించడం బాధాకరం అని దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. విద్యుత్ శాఖ అధికారులతో ఫోన్‌లో మాట్లాడి పూర్తి సమాచారాన్ని తెలుసుకున్నారు. విద్యుత్ శాఖ నుండి వచ్చే నష్టపరిహారాన్ని ఇప్పిస్తానని కుటుంబానికి హామీ ఇచ్చారు. కార్యక్రమంలో నాయకులు సుప్రభాత రావు, కౌన్సిలర్ దేమె యాదగిరి, శ్రీధర్‌రెడ్డి, విప్లవ్‌కుమార్, జిల్లా పార్టీ కార్యదర్శి పంజా మహేందర్, పట్టణ అధ్యక్షులు జిట్టి మారుతి, మండల కార్యకర్తలు పెద్దపైడి రాజురెడ్డి, మోహన్‌రెడ్డి, మధుసూదన్‌రెడ్డి, యువజన నాయకులు వినోద్, భూమాగౌడ్, ఆకుల బాలయ్య, భాజ రమేష్, చంద్రం, మసూద్, ఆలీ, గాలిబాబు, మహేష్, ధన్‌రాజ్ తదితరులు పాల్గొన్నారు.

పంటలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్‌రావు

